
UNIVERSAL
LIBRARY
OU_204050
UNIVERSAL
LIBRARY

Approved by the Madras Text Book Committee.



స్వామి రామతీర్థ, యం. ఏ.

యం. ఆర్. కృష్ణరావు & కంపెనీ, నెల్లూరు

సుబోధినీ గ్రంథమాల నెల్లూరు:—౨

# రామతీర్థస్వామి

ఇది

పంగనామల వేంకటరంగరావుగారిచే

రచింపఁబడి

యం. ఆర్. కృష్ణరావు అండు కంపెనీవారిచే

ప్రకటితము

ద్వితీయముద్రణము

1918

సర్వస్వామ్యసంకలితము

CHECKED 1951
Checked 1969
Checked 1965

**Printed at the Andhra Patrika Press**
**No. 7, Thumbu Chetty Street**
**G. T. Madras.**

# సంపాదకీయ విజ్ఞప్తి

---

ప్రథమ ముద్రణము

---

ఉత్తరహిందూస్థానమున మిక్కిలి ప్రఖ్యాతిగాంచి జీవితమంతయు భారతీయుల శ్రేయోభివృద్ధికై వినియోగపఱచిన ఇమ్మహనీయుని జీవిత చరిత్రమును మా గ్రంథమాలయందు ద్వితీయగ్రంథముగాఁ బ్రచురించుటకై మాకు సాయపడి మాకొఱకై శ్రమపుచ్చుకొని క్లుప్తముగా నీచరిత్రమును నత్యల్పకాలములో వ్రాసి ప్రచురణమునకై మా కొసంగిన శ్రీ పంగనామల వేంకటరంగరావుగారికి మే మెంతయుఁ గృతజ్ఞులము.

మన్నెపల్లి రామకృష్ణరావు

# అంకితము

---

సీ. అసమానబుద్ధి విద్యార్థిదశనె చూపి
జనులకు నెవఁడు విస్మయముగొలిపె
అహిఁబోలె జనయోగ మట వీడి శాంతికై
ఎవఁడు హిమాద్రిఁ బెక్కేండ్లు నిలిచె
తానైన తత్త్వ మందఱకుఁ బ్రబోధింప
ఖండాంతరముల నెవ్వండు తిరిగె
స్వమతవిరోధులై చను నార్యులకు శ్రుతి
ప్రాశస్త్య మరసి యెవ్వండు దెలిపె

గీ. ఆత్మదేశంబుకొఱకు, దేహమ్ము, మనంబు
ప్రాణములనిచ్చె లఘుతృణంబట్ల నెవఁడు
రామతీర్థునకుఁ బ్రశాంత రమ్యమూర్తి
కంకితమొనర్తు నీపొత్తమధికభక్తి.

పంగనామల వేంకటరంగరావు

శ్రీ

# రామతీర్థస్వామి జీవితము

—— ० ——

## జననము

హిందీభాషయందు శ్రీమద్రామాయణమును రచించి, అద్వితీయంబైన కీర్తింగాంచి, ముక్తసంగుఁడై శిష్యసహస్రముతోఁ గాశీపురమున నివసించుచుండిన భక్తశిరోమణి యగు గోసేఁ తులశీదాసుని వంశము పంజాబు రాష్ట్రములో గుజరాన్వాలా మండలంబున మురళీవాలా యను గ్రామమందు వర్ధిల్లుచుండెను. నేటివఱకు నా గ్రామమందే తులశీదాసు వంశజులు కాఁపురము చేయుచున్నారు. వీరు గోసేఁ బ్రాహ్మణులు, శుద్ధశ్రోత్రియులు. ఈ వంశమునందే మన కథానాయకుఁ డగు రామతీర్థుఁడు జన్మించెను. గోస్వామి హీరానందుఁడు రామతీర్థుని తండ్రి. ఈయన కడు బీదవాఁడయ్యును, వాయవ్యదిశయందుండు పొలిమేరరాష్ట్రమందలి హిందువులకు గురువుగా నుండుటచే, పిషావర్, స్వాత్ మున్నగు పట్టణంబులకు శిష్యసంచారమునకై యప్పుడప్పుడు వెళ్లుచుండుటచే దొరకుచుండిన సన్మానద్రవ్య

మీయనకు జీవనోపాయముగ నుండెను. ఇది కాకుండ వేఱొండు ద్రవ్యార్జన విధంబు వీరికి లేకుండెను. పేదఱికముతోఁ గూడినను బవిత్రమైన యీ బ్రాహ్మణవంశమందు గోసేఁ తీర్థరాముఁడు మురళీవాలా గ్రామమునందే హీరానందునికి 1873-వ సంవత్సరమున జన్మించెను. ఈతనిపేరు తీర్థరాముఁ డయినను, జనులు రామతీర్థుఁ డనియుఁ జెప్పుకొనుచుండిరి. రామతీర్థుఁడు జన్మించిన కొన్ని దినములకే యతని తల్లి స్వర్గస్థురా లయ్యెను. అందువలన రామతీర్థుఁడు తన ముదుసలి మేనత్తచేఁ బెంపఁబడెను. తండ్రియగు హీరానందుఁడు శిష్యబృందమునకు హితోపదేశముచేసి యుపకృతిం బొందనెంచి దేశసంచారము గావించుచుండుటచే, రామతీర్థుఁడు తన యన్నగారగు గోసేఁ గురుదాసుచేఁ బరిపోషింపఁబడుచుండెను. శైశవమందే జనని చనిపోవుటచే రామతీర్థుని కాహారమునకు నావుపాల నతని మేనత్త తెచ్చి యిచ్చుచుండెను. అందువలన గోక్షీరపాన మలవడిన రామతీర్థుఁడు వయసువచ్చిన కొలఁది నా యాహారమందే విశేష ప్రీతిం జెందుచుండుటయె కాక రమారమి యిఱువదిసేర్ల పాల నెక్కుడూరియే త్రాగఁగలిగి యుండెను. ఇతని జన్మకాల గ్రహసంపత్తిం గనిన జ్యోతిశ్శాస్త్రపండితులు రామతీర్థుఁ డద్వితీయ మేధావంతుఁ డగు ననియు, ఇతని ప్రతిభ లోకమంతయు వ్యాపించుననియు, మోక్షహేతువైన గ్రహవీక్షణము

మిక్కిలి యనుకూలముగ నున్నదనియు, మహాత్ముఁ డగు ననియు నుడివిరి.

## శైశవము

మాటలువచ్చినది మొదలు, రామతీర్థుఁడు ప్రతివిషయమును జక్కఁగఁ బరీక్షించుటయేకాక, దానిసంగతి నంతయు నడిగి తెలిసికొనుచుండెను. తనగృహమందు జరుగుచుండెడి పురాణ కాలక్షేపమం దధిక కుతూహలము కలిగినవాఁడై, రామలక్ష్మణ భీమార్జున వీరాగ్రేసరుల చర్యలం దుత్సాహము కలవాఁడై, మహాత్ముల చరిత్రల నెల్ల శ్రద్ధతో గమనించు చుండెను. ఇట్టి కాలక్షేపములం దాధ్యాత్మిక విషయములు ప్రసంగమునకు వచ్చినప్పు డాసంగతులను వినుచుండి గ్రహించుటకుం దగువయస్సు లేకుండినను విడువక "పుణ్యమనఁగ నేమి, పాపమన నెట్టిది, ధర్మమనఁగ నెద్ది, భగవంతుఁ డెక్కడనుండును, ఆయనను జూచు టెట్లు" మొదలగు ప్రశ్నలను రామతీర్థుఁ డడుగుచుండెను. శైశవమం దొనరించిన కార్యములు వాని ఫలితములు, రామతీర్థుని మనస్సున దృఢముగా నాటుకొని యుండెను. ఒకదినమందుఁదనతోడి బాలురతో రామతీర్థుఁడు తనయింటి పెరడులో, కొన్ని గుంటలుచేసి యందుఁగొన్ని గింజలను బెట్టి, కొంచెము నిరుపోసి, మట్టి కప్పి, పాపము! భోజనమునుగూడ మానుకొని, ఆ గింజలు మొలక లెత్తునని యక్క-

డనే కాచియుండెను. కాని యెంతకాలము కూర్చుండియున్నను నొక్క మొక్కైన నేలమీఁదికిరాదయ్యె. చూచి చూచి విసుగెత్తి, ఇంకను గింజలు మొలవలేదని గుంటను గొంచెము త్రవ్వి చూచెను. మొలకయొక్క పోఁబడిగూడ గానరాకుండెను. మఱికొంచెము మట్టితీయనెంచి, ఆ మొలచుచున్న మొక్కలకు హాని కలుగునేమో యను భయముతోఁ బహు జాగరూకతతోఁ బైఁబైని మట్టితీసి చూడఁగాఁ బాతినగింజలు గానే కనఁబడెను. ఆబీజములు తన యిచ్ఛానుసారము మొలవలేదని కోపపడి పెద్దవారితో నతఁడు చెప్పెను. వారలు గింజలు విత్తినతోడనే మొలక లెత్తవనియు, అవి పక్వమై మొలచుటకుఁ గాలము వలయుననియు, ప్రతికార్యమునకును ఫలితము వెంటనే కలుగదనియు బోధింపఁగా నా సంగతి గ్రహించినవాఁడై రామతీర్థుఁడు దానిని మఱవక 25 లేక 26 సంవత్సరములు గడచిన పిమ్మట 1902-వ సంవత్సరము డిసంబరు నెల 26-వ తేదిన, అమెరికాదేశమందలి సాన్‌ఫ్రాన్సిస్కో నగరమం దుపన్యసించుచు ని కథ నా దేశస్థులకు వివరించి, యాతురముకూడదనియు తాళిమి సర్వశ్రేయోదాయకమనియు నుపదేశించెను.

రామతీర్థునికి దన శైశవమందుఁ దా వినిన విషయములు సదా జ్ఞాపక ముండెననుటకు దృష్టాంతముగా నీ క్రింది కథను వివరించెదను. మూఁడేండ్ల ప్రాయమున నొకనాఁడు

రామతీర్థుఁడు తన గ్రామ సమీపమున నుండిన యరణ్యము నకుఁ బెద్దవారిచేఁ బిలుచుకొని పోఁబడగ నక్కడ నొంటిరిగ నితరులతో నుండవలసి వచ్చెను. ఆ సమయమున నొక్క పేరువడిన పెద్దదొంగ రామతీర్థునితో, తన సాహసకృత్య మొందు వర్ణించెను. రామతీర్థుఁ డతిబాల్యమందున్న వాఁడు వర్ణింపఁబోయెడి సంగతిని బాగుగ గ్రహింపఁజాలఁడని యెంచి యా తస్కరుఁడు కథను జెప్పఁ దొడంగెను.

ఒకానొక భాగ్యవంతుని సౌధంబున గడు విలువగల నగలున్న సమాచారము నెఱింగి వాని నపహరింపవలయునను బుద్ధిపొడమఁగా నీదొడ్డదొంగ యనేకవిధముల నా ప్రాసా దంబుఁ బ్రవేశింపఁ బ్రయత్నించెను గాని, వాని యత్నము సఫలము గాకుండెను. ఆనగలను హరింప నుద్దేశము దిన ములకొలఁది ప్రబలమగుచు, అందులకుం దగు నుపాయం బుల నెన్నింటినో యాలోచింపఁగ నట్టచివర కా దొంగకు మంచి యోచన యొకటి కుదిరెను. ఆ దివ్య హర్మ్యంబు చెంత మహావృక్షం బొక్కటి శతశాఖాయుతంబు తేజరిల్లు టయే కాక యాప్రాసాదంపు మూఁడవయంతస్తులోని గవా క్షమునకు నెదుట నుండుటం గాంచి యాచోరుఁ డా చెట్టెక్కి యొక్క గట్టిపగ్గ మా తరుశిఖర శాఖయందు దిట్టముగాఁ గట్టి దాని నుయ్యాల లాగున నిర్మించుకొని, నడిరేయి నా యు య్యాల నెక్కి పెద్దపెద్ద యూపులూఁగి యా గవాక్షమును

దన పాదఘాతములచేఁ బగులఁ గొట్టి తా నా మూఁడవ యంతస్తునందుఁ జేరి, వేసవి కాల మగుటచే నా యింటివార లయిదవ యంతస్తునందుఁ బరుండుదు రని యదివఱకే తెలిసికొన్నవాఁడు కావున నిర్భయముగా నా గవాక్షము నుండి, తోఁడఁదీసికొనిపోయిన త్రాళ్ళను గ్రిందికిఁ జాఱవిడిచి, తనకుం దోడుగా వచ్చియుండిన ముగ్గురునైదోడులను బై కెక్కించుకొని, నలుగురు నా సదనమందు నగలకై వెదకఁ బ్రారంభించిరి కాని యెక్కడను వానిం గాంచరైరి. అత్తఱి మన చోరశిఖామణి యేకాగ్రచిత్తమున నూహింప నగలు భూమిలోఁ బాతిపెట్టఁబడి యుండవచ్చునను భావంబు మనం బునం దగులఁగా, వారలందఱును నేలం ద్రవ్వసాగిరి. జనులు సాధారణంబుగ నితరు లనుమానింపఁదగనట్టి స్థలంబునఁ దమ విత్తాదులం దాఁచుకొనుట సహజంబని గుర్తెఱింగిన యను భవశాలియగు నా గడిదొంగ యెట్టి యనుమానమునకును నాస్పదంబు కాని స్థలంబుననే ఖననంబొనర్చెను. ఆ దినము లలో లోకు లీవిధంబుననే తమ విత్తమును భద్రపఱచుకొను చుండిరి. ఇక్కడ నక్కడఁ ద్రవ్వచూడఁగ, నా తెక్కలికానికి మిక్కిలి రొక్కంబుగల బొక్కసంబు చేఁజిక్కెను. అట్టి సమ యంబున మేడమీఁద నొక ధ్వని వినవచ్చెను. ఆ కన్నగాని కాయమంతయు ఝల్లుమని గుండెనీరై యాపాదమస్తకంబు వణఁకు దగిలి గడగడ వణంకసాగెను. అతని మనస్సు విభ్ర

మము నొంది కలఁతనొందెను. ఆ యవస్థయొక్క వర్ణనము రామతీర్థుని మనంబున దృఢంబుగ నుండెను. ఆ ముని మ్రుచ్చులందఱును మృత్యువువాతంబడితి మని యనుకొనిరి. వారలు మరణావస్థ ననుభవించుచున్నట్టుండిరి. ఆస్థితియందొకచిన్న యెలుక యేని వారిం జంపఁగలిగియుండెను. అట్టితఱి నాతస్కరశ్రేష్ఠుఁ డనన్యశరణ్యుఁడై భగవత్పాదారవిందంబులందు శరణాగతి చేసి పరమకారుణికుండు నార్తజనరక్షకుండగు నారాయణుని, నిశ్చలభక్తితోఁ బ్రార్థింపఁ దొడంగెను. అప్పు డతనిమనంబు శరీరమును వదలి సమాహితమైయుండెను. పశ్చాత్తప్తమానసుఁడై శరీరాభిమానము వదలి చోరుఁడు తాను భగవదధీనుఁడయ్యెను. అతని మనస్సు విపరీతాద్భుతస్థితిం జెందియుండెను. ఆ దొంగవాని నిశ్చలప్రార్థన హృదయతలమునుండి యుద్భవిల్లి యత్యాదరమై మహోత్తరమై యాంతరమై నిష్కళంకమై విరాజిల్లెను. భగవదైక్యమతఁడు నొందెనని చెప్పనగును. వేఱుతలంపు లేదు. ప్రపంచమెల్ల శూన్యమైయుండెను. ఈ ప్రార్థనకు వెంటనే ఫలము గలిగెను. ఆ శబ్దము మణఁగిపోయెను. గృహమం దెవ్వరును మేల్కొన లేదు. ఆచప్పుడెలుకవలనం గలిగెను గాన నప్పుడే నిలిచిపోయెను. దొంగలకు వడఁకు తగ్గెను. నిరాటంకముగా సఫలమనోరథులై యామేడనుండి వారు వెడలివచ్చిరి. ఈ వృత్తాంతమందలి విషయమును రామతీర్థుఁడు 1903-వ

సంవత్సరము ఫిబ్రవరినెల 16 తేదిన నమెరికాదేశస్థులకు మానసికస్థైర్యమును గుఱించి యుపన్యసించుచుఁ జెప్పెను.

## విద్యాభ్యాసము

అయిదవయేట రామతీర్థునిఁ బాఠశాలయందుఁ జదువ వేసిరి. బుద్ధి తెలిసినది మొదలు చిన్న చిన్న కథల నాకర్ణించుచు నందలి సందర్భములను గమనించుచుఁ దనకుం గలిగిన సందేహంబుల నడిగి తీర్చికొనుచు, రామతీర్థుఁడు తన కుశాగ్ర బుద్ధిని వెల్లడించుచుండెను. మొదటినుండి యితనిబుద్ధి యపూర్వమైయుండెను. ఇతని యోచనాశక్తి, ఏకాంత వాసమందలి ప్రేమ, ఇట్టివని వర్ణింపఁగలిగినవారలు నేఁటికిని మురారివాలాగ్రామమునఁ గలరు. విద్యార్థిదశయందు రామతీర్థుఁడు మిగులఁ బ్రకాశించెను. చుక్కలలోని చందమామ చందంబునఁ దోడిబాలురలో రామతీర్థుఁడు తన సూక్ష్మబుద్ధిచేఁ బ్రజ్వరిల్లుచుండెను. ఎల్లప్పుడును దన పాఠములను జక్కఁగా వల్లించుచు నందలి సారమును గ్రహించుచు, తెలియని సంగతులు సుబోధము లగునంతవఱకును విడువక, విషయ మితరుల నడుగకయ గ్రహించుచుండెను. గృహమందుఁ దండ్రికిని, అత్తకును, అన్నగారికిని, ఇతరులకు నతి విధేయుఁడుగానుండి యల్లరిసేయక చెప్పిన విధముగ నడుచుకొనుచు, వారల కధిక సంతోష మతఁడు బాల్యమందుఁ గల్గించుచుండెను. విద్యార్థిగా నొక్క నిమేషమైన వ్యర్థ

పుచ్చక ప్రపంచమందలి స్వభావచిత్రములను, పారమార్థిక విషయములను బార శాలయందలి విద్యావిషయములను రామ తీర్థుఁడు సర్వదా గ్రహించుచుండెను. ఉపాధ్యాయులందఱును రామతీర్థుని మెచ్చుకొనుచుండిరి. పై తరగతులకు వెళ్లినకొలఁది, తండ్రి కావలసిన విద్యాపరికరములం గొని యిచ్చి విద్య నేర్పింపఁగలిగినశక్తి లేనివాఁ డగుటంజేసి రామ తీర్థుఁడు విద్యార్థిగా మిగులఁ బేదఱిక మనుభవించెను. పై తర గతులందును గళాశాలయందును దన యసామాన్యప్రజ్ఞను గనఁబఱచి విద్యార్థివేతనములం గొనుచు కాలమంతయు గాఢం బైన విద్యావ్యాసంగంబుననే కడపెను. పారశాలకుఁ బోవు నపుడు రామతీర్థునికిఁ బై కోక యొక్కటియును, మొలకు రెండు లాగులును దలకొక చిన్నరుమాలయు నుండెను. ఇవ న్నియుం గడు ముతకగుడ్డ లగుటవలన సుమారు మూఁడు రూప్యంబులే వెల కలిగియుండెను. క్రమక్రమముగ మెట్టుపై మెట్టెక్కి పిన్నవయస్సుననే ప్రవేశపరీక్షయందతఁడు కృతార్థుఁ డయ్యెను. అదిమొదలు కళాశాలలోఁ జేరి చదువుచుండిన కాలంబున దారిద్ర్యము హెచ్చెనుగాని ప్రతిభ మిక్కిలి ప్రకా శింపఁ జొచ్చెను. కడుపు నిండుట కన్నమును, చదువుకొను టకు దీపమును ధరించుట కుడుపులును లేక యాతఁడు మిక్కిలి శ్రమనొందుచుండియు నన్నమైన నొకపూఁట మాని దీపమున కగు చమురునకై యీ సొమ్ము వినియోగపఱచు

చుండెను. పలుమారు అనేక దినములకొలఁది యన్నము లేక మాడవలసివచ్చెనుగాని కళాశాలకుఁ బ్రతిదినంబును కాలమునకు వెళ్లి యథావిధిగఁ బాఠంబుల నొప్పగించుచుండెను. తా నుపవసించుచున్న సంగతియె యితరులకుఁ దెలియకుండు నట్లు శాంతమైన వదనారవిందముతో దుఃఖముగాని, శ్రమముగాని, క్షుద్బాధగాని కొంచెమైన నితరులకుఁ గనఁబఱపకుండెను. అతివినయముతో, శ్రద్ధతో, విశేష జాగరూకతతో రామతీర్థుఁ డహోరాత్రములు కృషిచేసి విజ్ఞానమును సంపాదించు చుండెను.

ఒకనాఁడు రామతీర్థుఁడు పుస్తకమొకటి తన హస్తమందుండ దానిం జదువుచుఁ బురమార్గంబున నడచు చుండఁగా నొకండు పరిహాసమునకై "ఇక్కడ నేమి చేయుచున్నావయ్యా? ఇది పాఠశాలగాదు సుమా! ఆ పుస్తకము నవలఁ బాఱవేయుము" అని పలుకఁగ రామతీర్థుఁడు "ప్రపంచ మంతయు నాకుఁ బాఠశాల" అని బదులు చెప్పెను. వేదాంత మితనికి నుగ్గుపాలతో నుద్భవించెను గాఁబోలు! రామతీర్థునికి విద్యాపరిశ్రమ విస్తారముగా నుండెను. రామతీర్థుఁడు బి. ఏ. తరగతియందుఁ జదువు చుండినపు డతనితో నొక సహాధ్యాయుఁ డొకటే గదిలో నివసించు చుండెను. ఈ జోడి బాలుఁడు సోదరుని భంగి కలసి మెలసియుండి యమితోల్లాసము గలవాఁడై యుండెను.

నృత్యమందును, గానమందును, ఆటలందును, దుమికి గంతులు వేయుటయందును, దనకాలము విశేష భాగము వ్యర్థపుచ్చుచుండెను. ఒకానొక దినంబున నొక సర్దారీ విద్యార్థిని "దినమున కెన్ని గంటలు విద్యకై వినియోగించెద" వని ప్రశ్న చేయఁగా, నతఁడు చిఱునవ్వు మొగంబున మొలక లెత్తఁగ 18 గంటలని ప్రత్యుత్తర మిచ్చెను. అంత నా సర్దారు "ఏమి చెప్పితివి? నా యెదుటనే నాలుగైదు గంటలు వ్యర్థ పుచ్చితివి. రాత్రి 8-9 గంటలు నిద్రించెదవని నాకుం దెలియును. ఇఁక నీకు మిగిలిన కాలము 10-12 గంటలైయుండ, 18 గంటలకాలము చదివెదనని నీ వెట్లు నుడివితివి." అని యడుగఁగా నా కుఱ్ఱవాఁడు "మీరు గణితశాస్త్రమును జదువలేదు. గణిత శాస్త్ర ప్రకారము నేను 18 గంటలు విద్యాభ్యాసమందుఁ గడపుచున్నానని నిరూపించెదను జూడుఁడు. నేనును రాముఁడు నొక్కటే గదిలో నున్నారము. కదా. నేను 12 గంటలు, రాముఁడు 24 గంటలు పాఠములం జదువ నుపయోగించి కొనియెదము. రెండుగలిపిన 36 గంటలగును. ఇద్దరికిని 36 గంటలైన, నొక్కరికి 18 గంటలగును. కనుక నేను 18 గంటలును రాముఁడు 18 గంటలును గణితశాస్త్ర ప్రకారము చదువుచుండినవారల మగుదుము గదా!" అని పలుకఁగ, నాసర్దారు "నీవు 12 గంటలు చదివెద వేమోగాని రాముఁడు 24 గంటలు చదువుచుండు ననుమాట నే నొప్పు

కొనంజాలను. అది యెట్లు సాధ్యము? రాముఁడు విశేష పరిశ్రమచేయు విద్యార్థి యన్ని నాకుం దెలియును. సర్వకళాశాలా సంబంధమైన విద్యాకృషియందే కాక యందులకు నాలుగైదుమార్లధికంబుగ నితర విషయములందును గృతార్థతంజెంద నుద్యుక్తుఁడై యనేక విషయములం దాసక్తింబొంది బరిశ్రమించుచున్న సంగతి నే నెఱుంగుదును. కాని మానవ స్వభావమునుబట్టి 24 గంటలు కృషిచేయ నేరికైన నసాధ్యమని తలంచెదను" అని యూసర్దారు వాకొనెను. అంత నా విద్యార్థి "రాముఁడు భుజించు సమయములయందును నిమిష మొక్కటియైన వ్యర్థపుచ్చక ప్రకృతి శాస్త్రప్రశ్నమో, గణితశాస్త్రమందలి కఠినమైన లెక్కయో, సిద్ధాంతసంబంధమైన హేతువాదమో యేదో యొకదానిమీఁద తన మనంబును లగ్నము చేయుచుండును. ఇవి గాకుండిన నేదోయొక సద్గ్రంథమునో, కావ్యమునో వల్లించుకొనుచుండును, లేదా పద్యము లల్లుచుండునుగాని యొక్కక్షణమైనను రిత్తపుచ్చంజాలఁడు. ఇంటిలోనుండినప్పుడు సీమసున్నములో గోడలమీఁద సుందరములైన బొమ్మలను రాముఁడు వ్రాయుచుండును. నిద్రించు నపుడును స్వప్నమందును నతని మనస్సు విద్యావ్యాసంగమునందే వర్తించుచుండును. స్వప్నములందు కవనము చెప్పుచుండును. చక్కని శైలిని పద్యములల్లుచుండును. ఆపద్యములను మఱవక నిద్ర మేల్కాంచినపుడు కాగితము

పై వ్రాసి పరీక్షింపఁగ నచ్చటచ్చట గణయతిప్రాసభంగములు కలిగియున్నను పద్యములు మధురముగ నుండెను గాని సందర్భ సముచితములుగాక, వరుసగా లేక పిచ్చివాని ధోరణివలె నుండును. ఎట్లుండినను నతని మనస్సు విద్యావిషయమందే స్వప్నమందును గృషిచేయుచుండుననని దీని వలనఁ దెలియనగును. కాఁబట్టి రాముఁడు 24 గంటలును విద్యాప్రసక్తిం గడపుచుండు" నని నుడివెను. ఈ విషయము నిజముగా నుండ నోపునని రామతీర్థుఁ డమెరికా దేశమందు 1903-వ సంవత్సరము జనవరి 15 వ తేదిన సువర్ణద్వారభవనంబున "మరణానంతరము లేక సర్వమతసమాధానము" అను నుపన్యాసమునఁ బేర్కొనెను.

కళాశాలయం దున్నతతరగతులందుఁ జదువుచుండెడు కాలమున, కళాశాలా పండితుల సాహాయ్యముఁ గోరకయే ప్రతివిషయమును, తానుగానే గ్రహింపవలయు నను శపథమూని, రామతీర్థుఁడు మహాగణిత శాస్త్రమున భగీరథ ప్రయత్నముఁ జేసెను. కొన్ని లెక్కల చిక్కులఁ విడఁదీయ నెంచి యెంతయో శ్రమపడుచుండెను. కొన్నింటిలో సులభముగాఁ జిక్కు విడిపోవుచుండెను. మఱికొన్నింటిలో నెంత పరిశ్రమించినను నిష్ప్రయోజనమై, చిక్కుసడలించు మార్గము గుర్తెఱుంగఁజాలక, సాయంతన మైదుగంటలు మొదలు ప్రాతఃకాలమున నాలుగైదుగంటలవఱకు ననేక పర్యాయము

లెన్నియో విధంబుల నాలెక్కలను జక్కఁగ గణించి పరిష్కరింపఁజాలక, విసిగి వేసారి, తానుండిన గృహముయొక్క పై మిద్దెనెక్కి యక్కడ విశ్రాంతికై పచారీచేయుచుఁ దాఁదలఁచిన దానిని నెఱవేర్పలేఁపోవుటకు ఖిన్నుఁడై, ఇట్టి పరాభవము నొందవలసిన జన్మమెందుకని తలంచి తన్నుఁదాఁ జంపుకొనుటకొఱకు ఖడ్గమును దెచ్చెను. శరీరమును వదల నుద్యమించినంతనే యా చిక్కులం దీర్చు మార్గము లతని మనంబునకుఁదట్టెను. అట్టిచో తలపెట్టిన యున్ని విషయములయందును దాఁదలంచినపని సఫలమగుటకై యతిశ్రద్ధాసమేతుఁడై పూర్ణమనస్సుతో కృషిచేయుచు విఫలమనోరథుఁడైనపుడు విసుగుజెంది వితాకుపడి "పని నే లక్ష్యము సేయను, ఇది యయినను గాకున్నను నాకక్కఱ లేదు. పనియందు నాకేమియు సంబంధము లేదు" అని తలంచుచుండును. ఉద్యమించిన కార్యముయొక్క ఫలితము నెప్పుడపేక్షింపమానెనో యాక్షణంబుననే యాపని పూర్తియగుచుండును. ఫలాపేక్షలేక కార్యములు సలుపుచుండ వలయునని రామతీర్థునకు విద్యార్థిగానుండునప్పుడే బోధకలిగెను. అది మొదలు నిష్కామకర్మ నభ్యసించిన యీ జ్ఞాననిష్ఠాగరిష్ఠుఁడు లోకమునందు స్వశరీరపాత సమయము వఱకును నిష్కామకర్మాభ్యాసమునే జనులకు బోధించెను.

కళాశాలలోఁ బ్రతి పరీక్షయందు నతఁ డున్నతస్థానమును బొందుచుండెను. మహాగణితశాస్త్రమునం దతి సమర్థుఁడై విశేషప్రజ్ఞం జూపి, బి. ఏ. పరీక్షయం దాఱితేఱినవారిలో నతఁ డగ్రగణ్యుఁ డయ్యెను. ఆ శాస్త్రమందే ఎం. ఏ. పరీక్షకు వెళ్లి అతి గౌరవముగఁ గృతార్థుఁ డయ్యెను. 1893-వ సంవత్సరములో ననఁగా 20 సంవత్సరముల వయస్సుననే లాహోరు సర్వకళాశాలయొక్క ఎం. ఏ. బిరుదును రామతీర్థుఁడు వహించెను. ఈ కాలములో రామతీర్థుని దేహ మస్థిపంజరమువలె నుండెను. అట్టి శరీరము నాతఁడు గాంచి, యతని ప్రాణములెట్లాశ్రయించు కొన్నవో యని వానిఁ జూచిన ప్రతి మానవుఁడు నాశ్చర్యము నొందుచుండెను. అతని యెముకలమీఁద మాంసమే లేక పలుచనిచర్మ మంటుకొని యుండెను. పొడుగ వడవంగా పెరిగిన సన్నని శరీరముమీఁద నతని పెద్దతల యుండెను. అతని గొంతుక బొంగుపోయి యుండెను. చక్కఁగా మాటలాడుటకును నతఁడు కష్టపడుచుండెను. అంత బలహీనుఁడుగా రామతీర్థుఁ డుండెను. అతఁడు కష్టములు గట్టెక్కెను. తన శరీరము బలిష్ఠమైనదిగాఁ జేసికొనఁ దలంచెను. అందుకై శరీర వ్యాయామములం గొన్నింటిని దానుగానే రామతీర్థుఁ డేర్పాటు చేసికొనెను. ఆ వ్యాయామంబులఁ గ్రమముగా నతఁ డభ్యసించెను. గోక్షీరము లధికముగఁ ద్రావఁ బ్రారంభించెను. ఇటులు

ప్రతి దినంబును గడపుచుండుటచే రామతీర్థుఁ డల్పకాలము లోనే మంచి యారోగ్యస్థితిం జెందెను. శరీర వ్యాయామ ములం దత్యంత కుతూహలము గలవాఁడై క్రొత్త క్రొత్త విధంబు లగు వ్యాయామంబులఁ గల్పించుకొని వాని నభ్య సించు చుండెను. అది మొదలు అవసానకాలమునకుఁ గొంత ముందువఱకును రామతీర్థుఁడు శరీర వ్యాయామంబుల విడి చిన దినమే లేకుండెను. ఆరోగ్యమును గాంచిన పిదప రామ తీర్థుఁ డతి సుందరుఁడుగా నుండెను. మృదువై, సున్నితమైన ముఖము, మెఱ్ఱైన కనుబొమలు, నల్లని నయనములు, విశాల మై యున్నతమైన లలాటము, దానిని విద్యాలోలత్వ మును విస్తార మనశ్శక్తిని వెల్లడించు చుండెను. అతఁడు గంభీరముగా నుండినపుడు చిన్న వక్రావయమైన గర్వ ముద్ర ముగాఁ గనఁబడుచుండెను. అతని యిచ్ఛాశక్తి యనుప మానమై యుండెను. అతని ప్రశాంత స్వభావము శుద్ధాంతః కరణము, నిష్కళంకత్వము, నిష్కాపట్యము, అమాయికత్వ మ్మెల్లరకు నాతనియం దనురాగ ముదయింపఁ జేయుచుండెను.

గణితశాస్త్రాభ్యాసమువలన రామతీర్థునికి ధారణాశక్తి ప్రబల మయ్యెను. అనన్యమనస్కత యధికంబయ్యెను. అవి రత ప్రసక్తి, స్థైర్యము నలవాటుపడెను. అతని గ్రహణ శక్తికి వ్యాప్తి, తీక్ష్ణత హెచ్చెను, నమ్రత్వము, నిరహంకా రత్వము నతనియం దతిశయించెను.

తన గురువునకు వ్రాసిన యుత్తరములు వలన రామతీర్థుఁడు విద్యార్థిగా నుండినకాల మేవిధంబుగఁ గడపినది తెలియవచ్చుచున్నది. ఆ జాబులు విద్యార్థులకేకాక యువజనుల కందఱికిని సహకారములుగనున్నవి. విద్యార్థులు దారిద్ర్య దేవతం బాలఁగించుకొన వలసిన విధంబు రామతీర్థుఁడు తన ప్రవర్తనవలనఁ దెలిపెను. ఆ లేఖలవలన నతని గురుభక్తి, ఆజ్ఞానువర్తన, నమ్రశీలత, లజ్జాశీలత, సహవిద్యార్థులతోఁ గలసిమెలసియుండు కష్టతర స్థితిగతులయందు నతనికిఁగల ప్రసన్న చిత్తత, ధీరత, ఎడతెగని యనారోగ్యస్థితియందును నతనికిఁగల పరిశ్రమ, ఆసక్తి, సహజగుణములుగ నుండిన మాతృగౌరవము, నిష్కపట సత్యాగ్రహము, మొదలగు నంశములు తెలియవచ్చుచున్నవి.

## కళాశాలా పండితత్వము

రామతీర్థుఁడు ఎం. ఏ. పరీక్షయందుఁ బట్టభద్రుఁడైన వెంటనే, లాహోరు నగరమందు ఫార్మన్ క్రైస్తవ కళాశాలలో గణితశాస్త్ర ప్రధాన పండితుఁడుగ నియమింపఁబడెను. ఆ నగరమునందు గవర్నమెంటు కళాశాలాధ్యక్షు లగు డబ్లియు బెల్ దొరగారు రామతీర్థుని సాహిత్య సంపన్నత్వమునకు మెచ్చుకొని ప్రావిన్షియల్ సివిల్ పరీక్షకుఁ జనుమని యతనిం గోరెను. కాని యత్యంతాధికపరిశ్రమచే

సంపాదించిన గణితశాస్త్ర సాహిత్యము ననేక విద్యార్థులకు
బోధింపవలయునను గాఢమైన వాంఛ రామతీర్థునకుఁ బ్రబల
మై యుండుటంజేసి యాపరీక్షకు వెళ్లుట కాతఁడు యత్నింప
నేలేదు. అయినను బట్టపరీక్షలం దత్యున్నత స్థానముఁ జెం
దుటచే నింగ్లాండు దేశమునకు వెళ్లి కేంబ్రిడ్జి సర్వకళాశా
లలోఁ జదివి యచటి పరీక్షలయం దుత్తమ గౌరవ స్థాన
మును బొందుటకై యేర్పఱుపఁబడిన రాజకీయ విద్యార్థివేతన
మునకు నతఁడు ముఖ్యతమ యోగ్యుఁడై యుండుటంబట్టి
రామతీర్థుఁ డా వేతనముం గైకొన నెంచెను గాని 'సీనియర్
రాంగ్లర్' అగుటకన్న మిన్నయగు పదవిం బొందవలసినవిధి
యతని ఫాలంబున లిఖించియుండుటచే నా విద్యార్థివేతన
మింకొక మహమ్మదీయ విద్యార్థికి నిచ్చివేయఁబడెను.

మహా గణిత శాస్త్ర పండితుఁడుగ రామతీర్థుఁడు
మిక్కిలి ప్రశస్తిని జెందెను. అద్వితీయ మనీషా గరిష్ఠుఁడై
కళాశాలలోని విద్యార్థిబృందంబున కమందానందంబు ఘటిం
చుచుండెను. గణితశాస్త్రమునం దతని పాండిత్య మపారము.
అతని బోధనాశక్తి యద్భుతము. ఎంత కఠినమైన లెక్కనయి
నను దానిని వ్రాయుట కెంతకాలము పట్టునో యదే కాల
ములో నింకను శీఘ్రముగను దాని స్వరూపమును నిరూ
పింపఁగలిగిన యనంతయుక్తి రామతీర్థునకు విశేషముగ
నుండెను. ఎట్టి శాస్త్రప్రశ్నమునైనను మిక్కిలి సులభముగా

గ్రహించుటయేకాక రామతీర్థుఁడు సులభతరముగ దానిఁ బోధింపఁ గలిగియుండెను. మహాగణితశాస్త్ర సూత్రము లన్నింటిని కరతలామలకము భంగి నుంచుకొనిన రామతీర్థుని ప్రజ్ఞావిశేషము విద్యార్థుల వివేకమును ప్రబోధింపసాగెను. శాస్త్రజ్ఞాన మంతయు నంగుళ్యగ్రములం దభ్యాసమువలన నుంచుకొనిన వాఁడగుటంజేసి 18 అంకెలుగల గుణ్యము 17 అంకెలుగల గుణకముతో హెచ్చింపఁబడిన వచ్చెడి లబ్ధము నొక్క పఙ్క్తిలో తత్క్షణమే వ్రాయంగలిగిన మేధావంతుఁ డా రామతీర్థుఁడు. ఇట్టి ప్రజ్ఞ యతనికెట్లు లభించెను? అభ్యాసమువలననే ఈ శక్తి లభించెననియు నభ్యాసము వలననే సకలము సాధింప నగుననియు రామతీర్థుఁడే యుపదేశించుచుండెను. గణితశాస్త్రపండితుఁడుగ నుండి గణితశాస్త్రము నభ్యసింపవలసిన యావశ్యకతను గూర్చియు, నా శాస్త్రమందుఁ బ్రకర్షము బొందఁదగు నుపాయంబుల గుఱించియు నొక చిన్నపొత్తమును రామతీర్థుఁడు రచించి ప్రచురించెను.

## వివిధభాషా ప్రావీణ్యము

1903 సంవత్సరము జనవరి 24 తేదిన స్వర్ణకవాట భవనమం దమెరికాలో సాన్ ఫ్రాన్‌సిస్కో నగర వాస్తవ్యులకు నుపన్యసించుచు, మనస్సు సరస్సువంటిదనియుఁ దా నేర్చిన పరిషియన్, అరబిక్, సంస్కృతాది హిందూ

దేశ భాష లా సరస్సుయొక్క యడుగు భాగమున నున్నవనియు నొక్క క్షణంబున నా సరస్సు నందు సంక్షోభము గలిగించి యా భాషలం బైకి తేవచ్చు ననియు నిటులు చేయుటయే స్మృతియనియు రామతీర్థుఁడు వచించెను. ఇందువలన నతనికి వివిధభాషా పరిచయము కలదని తెలియవచ్చు చున్నది. ఇదియునుగాక యతని ప్రశంసకులును రామతీర్థుఁడు పరిషియన్, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు, సంస్కృత భాషలలో విశేష ప్రావీణ్యమును సంపాదించెననియు నాయా వాఙ్మయములన్ సాంతముగఁ జదివెననియు వ్రాసియున్నారు. రామతీర్థుఁడు ప్రాచి, ప్రతీచి తత్త్వముల నన్నింటిని సమగ్రముగ గ్రహించెను. శంకర, కణాద, కపిల, గౌతమ, పతంజలి, జైమిని, వ్యాస, శ్రీకృష్ణ, సిద్ధాంతము లంచును, క్యాంట్, హెజెల్, గిథే, ఫిచీ, స్పైనోజా, కామ్టి, స్పెన్సర్, డార్విన్, హేకెల్, టిండల్, హక్స్లే, స్టార్, జార్డన్, జేమ్సు దొరలచే వ్రాయఁబడిన తత్త్వ విషయములందును, రామతీర్థుఁడు తన కుశాగ్రబుద్ధిచే నద్వితీయ ప్రజ్ఞం బొందెను. హాపీజ్, మౌలానారూమ్, మాగ్రాభి, ఉమూరుఖయామ్, మున్నగు పరిషియా దేశపు సుఫీ కుంజరులయొక్క రచనల నన్నింటిని సమగ్రముగాఁ జదివి యందలి సారమును రామతీర్థుఁడు గ్రహించెను. కలాశాలలో విద్యార్థిగా నుండినప్పుడే యుపనిషత్తుల ననేక పర్యాయము లర్థ సహితముగా నతఁ డధ్యయనముఁ జేసెను.

తులసీదాసు, సూరదాసు వ్రాసిన గ్రంథములను గూడ రామ
తీర్థుఁడు చదివెను. పంజాబీ కవుల కవిత్వమందలి మాధుర్య
మనోజ్ఞత్వములం దనురాగము గలవాఁడై యుండెను. అత
నికిఁ బ్రకృతి శాస్త్రమందును, వృక్ష శాస్త్రమందును, ప్రవే
శము కలదు. ఇతని జ్ఞాన మపారమై యనంతమై లోకోప
కారకమై యుండెను. ప్రపంచమం దుద్భవించిన మహాను
భావుల భావముల నన్నింటిని గుర్తెఱింగిన వాఁడై వాని
సారాంశమును గ్రహించి సర్వమత సమాధానమును లోక
మునకు రామతీర్థుఁడు బోధించెను.

## గృహస్థాశ్రమము

రామతీర్థుఁడు కళాశాలను వదలి వ్యవహార దశ
యందుఁ బ్రవేశించిన పిమ్మటనే గృహస్థుఁ డయ్యెనని యూ
హింపఁ దగి యున్నది. 1894 వ సంవత్సరము మొదలు
1898-వ సంవత్సరమువఱకు నతఁడు కుటుంబియై వర్తించె
నని వచించుటకు నిదర్శనములు కలవు. అంతకుఁ బూర్వ
మెంతకాల మతఁడు గృహస్థుఁడుగానుండెనో చెప్పుటకు వలను
లేకయున్నది. సందర్భములనుబట్టి యూహించిన, రామతీర్థు
నికి విద్యార్థిగానుండఁగ వివాహమైనను నయియుండవచ్చును
గాని, భార్య కాఁపురమునకు వచ్చినది మాత్ర మతఁడు ఎం.
ఏ. బిరుదును బొందిన తరువాతనే యని దృఢముగఁ జెప్ప

వచ్చును. సంసారమందుండియు రామతీర్థుఁడు సంగమును వర్జింపఁగలిగియుండెను. తుల్యశీలమనోవృత్తిగల భార్య యత నికి దైవానుగ్రహంబునఁ దటస్థించుటచే నతని గృహస్థాశ్రమ జీవితము పవిత్రమై ప్రపంచమునకు మార్గదర్శకమై విరా జిల్లెను. వీరు భార్యాభర్త లిరువురు నొకటే మనస్సుగలవారై యొకరి నొక రుద్ధరింపఁగలిగిన వారలై యుండిరి. అన్యోన్యా నందము ప్రధానముగ వారలు గమనించుచుండిరి. వీరల సంసారము పారమార్థిక జీవనమును వెల్లడి చేయుచుండెను. అన్యోన్యహితకాములై వార లభ్యుదయమును బొందఁ బ్రయ త్నించుచుండిరి. స్త్రీని బశువులాగునను, అచేతనవస్తువుగను, ఘోరనరకమునకు ద్వారముగను, ఇంద్రియోపభోగమునకు సాధనముగను బరిగణించుట న్యాయసమ్మతమాత్రమును గా దని రామతీర్థుఁడు నొక్కి వక్కాణించెను. ఒకరికొకరు భార్యా భర్తలు భగవంతుని దర్శించుటకు యోగ్యమైన యద్దము వలె నుండవలయునని యతని యభిప్రాయము. సంసారమం దెవ్విధంబుగ నతఁడు సంచరించినది రామతీర్థుఁడు 1902-వ సంవత్సరం డిసెంబరునెల 30వ తేదిన శాస్త్ర పరిషత్ భవన మందు "గృహములు సౌఖ్యకరములుగఁ జేసికొను టెట్లు" అను విషయమై చెప్పిన యుపన్యాసమువలనను, 1903 సం॥ ఫిబ్రవరినెల 1-వ తేది యాదివారము సాయంతనమున "గృహస్థ జీవనము, బ్రహ్మసాక్షాత్కార"మను విషయములంగూర్చి

యిచ్చిన యుపన్యాసమువలనను గ్రహింపఁ దగియున్నది. సంసారమందెట్లు వర్తింపవలయునను విషయమై రామతీర్థుఁడు నుడివిన యంశముల సారాంశ మీక్రింద వివరించితిని.

గాలిచేఁ గదలింపఁబడుచున్న సన్నని రెమ్మలపై వ్రాలి క్షణమాత్ర ముండి యెగిరిపోవునట్టి పక్షివలె జనులు సంసారమందుఁ బ్రవర్తింపవలయును. ఆ రెమ్మ తాను గూర్చుండుటచేఁ గడు వంగుచున్న దని కనుఁగొనియుఁ దనకు ఱెక్కలు గలవను జ్ఞానముచే నా శకుంతంబు నిర్భయముగా నా రెమ్మమీఁద నుయ్యాల లూఁగుచుఁ బాడుచుండును. క్రిందికిని బైకిని అల్లలాడుచున్న కొమ్మపైఁ గూర్చుండినను దన రెక్కలమీఁదనే భారమును మోపి యాకొమ్మను గాక తన ఱెక్కలనే నమ్ముకొని యుండును. అదే విధముగ మన మెక్కడ నుండినను, నాలు బిడ్డలం దెంత మక్కువఁ జెంది యుండినను జిత్తమును సక్తము గానీయక మనయందుండు బ్రహ్మభావమునే యాశ్రయించుకొనియుండవలయును. ఇక్కరణిని నడచుకొనిన పక్షమున జనులు విముక్తు లగుదురు. అహంకారవర్జిత సర్వకార్యములు బంధకములు కానేరవు. అహంకారమును వదలుటయే సర్వసంగ పరిత్యాగము. నదులు పాఱుచుండునటులను, సూర్యుఁడు ప్రకాశించుచుండు విధంబునను, పుష్పములు వికసింప నలుప్రక్కలును మధుర పరిమళము వ్యాపించు పగిదిని, మన కార్యము లన్నియు

నుండవలయును. అదే తెఱగున మనము సర్వకార్యములు సలుపుచుండవలయును. మహాపురుషు లందఱును, ధీసంపన్ను లందఱును, ఈ రహస్యమును గ్రహించి తమ కార్యము లొనర్చుచుండిరి. అకర్తృకభావమునఁ గృషిచేయుటచే వారి కార్యము లంత శ్రీమంతము లగుచుండెను. ఇంద్రియోపభోగమునకై లోలత్వము గలవారు నిక్కమైన యానందము ననుభవింపనేరరు. విషయపరాయణత్వమే సౌఖ్యసంధాయకంబైన, కుటుంబము లన్నియు నానందమగ్నములుగ నుండవలయుఁగదా? వేయి కుటుంబముల కొక్కఁడైన సదా సంతోషమనుభవించుచుండునా యని యనుమానింపఁ దగియున్నది. దీనికిఁ గారణ మొండొరుల యానందము వృద్ధిపఱచుకొను విధము వార లెఱుంగరు. ప్రాపంచిక విషయానురాగము వలన ననర్థము లనేకములు గలుగుచుండును. సంతాపమున కది మూలము. ఎద్ది సత్యముగఁ జిత్తము నాకర్షించి హృదయంగమమై రమణీయమై పురుషప్రవర్తన హేతువగుచున్నదో, దానిని యోచింపం దగు. అద్ది కాయమా, చర్మమా, నేత్రములా, నాసికయా, శ్రోత్రములా? ఇవి యెవ్వియుం గానేరవు. ఇవి యసమర్థములు. ఇవియే ప్రేమార్హమైన విషయములైనను, వీనియందే మనోరమత్వముండినను శరీరము విగతప్రాణమైనపుడు ఈ ప్రేమార్హత, ఈమనోహారత్వ మెక్కడి కేగెను? ఏమైపోయెను? ఈయాకర్షణశక్తి మఱియెందుఁ గల

దు? ఈ మనోజ్ఞత్వము మోహము నెవరు కల్పించుచున్నారు? సహేతుకముగ నాలోచించిన నయ్యది శరీరమం దంతర్వర్తి యగు భగవత్తత్త్వమే యని తెలియవచ్చును. శరీరము భగవంతునికిఁ బైని గప్పుకొను వస్త్రమువంటిది. వస్త్రమును ధరించు పురుషునికన్న వస్త్రమునే యధికముగ నెన్నందగునా? చక్కఁగా విమర్శించిన సత్యము కన్నులకుఁ దట్టును. బాహ్యసౌందర్యము, లావణ్యము, శోభ ఆంతరమందలి తత్త్వమువలననే సంభవించు చున్నది. అటులఁ గాకుండిన మరణానంతరమునందును నివి యుండవలయుఁగదా? ఈ తత్త్వమదృశ్యమై, వర్ణనాతీతమైనను, దేహమందు వర్తించుచుండును. ప్రతిమనుజునియందును నీ తత్త్వమునే గనుచుండిన, మహాత్మునికి సంసారమందలి వైషమ్యములు, వైపరీత్యములతని సామర్థ్యమును బలమును నధికముగ నభివృద్ధిం జెందించుచుండును. ప్రసుదేశమం దిట్టి మహాత్ముఁ డొకఁడుండెను. డొకఁడుండెను ఆయనభార్య యధిక కోపస్వభావము కలదిగా నుండెను. ఒకానొక దినంబున నావిద్వాంసుఁ డేదో యొక్క తత్త్వముం గూర్చి గాఢముగా యోచించుచుండు సమయమున నతనిభార్య భర్తకడకువచ్చి యేదో సంగతిఁ జెప్పనుద్యమించెను, ఆయన దృష్టిని ద్రిప్పఁబూనెను గాని యాయన కించిత్తైనను తన ధ్యానమునుండి తొలఁగఁడయ్యెను. తాఁ దెలిసికొనందలంచిన తత్త్వమును సంపూర్ణముగ గుర్తెఱుంగఁగలుగు

వంతవఱకును దానిని వదలు స్వభావ మతనికి లేకయుండెను. తాఁజెప్పఁబూనిన దానిని వినక పెడచెవి నిడెనని యెదందలంచి కోప మావేశము కాఁగా నామె మబ్బులోని యుఱుముల వలెను ఘుంఘుంమారుతము భంగి నెలుఁగెత్తి బిగ్గఱగా అఱవసాగెను గాని యాపండితుఁడు కొంచె మైనను లొంగఁ డయ్యె. ప్రకోపానలదగ్ధమానస యై యధికసంరంభము తోఁ బెరఁటులోనుండిన పేడనీళ్ళకడవం దెచ్చి భర్తనెత్తిన కుమ్మరించెను. అప్పుడు ప్రపంచమందలి ప్రతివస్తువందును భగవంతుని దర్శించు యోగ్యతఁ గలిగిన యామహానుభావుఁడు దరహసిత వదనారవిందుఁ డై "పలుమాఱు మేఘము లుఱుముచున్నప్పుడు వర్షము కురియు" నను లోకోక్తి నేఁడు నిరూపింపఁబడెనని పలికి పకపక నవ్వెను. ఇదివఱకెల్లను ఆమె ప్రచండంబుగఁ బరుషభాషణములు పలుకుచుండినపుడు వర్షము లేని వట్టి మేఘాడంబరముగా నుండెను. నేఁడో? వర్షముకూడఁ దటస్థించెనని నుడివి మరల నతండు అదేధ్యానమందుఁ దనచిత్తమును నియోగించెను. చిత్తమం దెట్టి సంక్షోభము లేక శాంతి ననుభవించు సామర్థ్యము ఆమహాత్మునకుండెను. ఒక మనుష్యునకు స్వాధీనమైన విషయము మఱియొక మనుష్యునకు స్వాధీనము కాక యుండునా? ఇట్టి మహాపురుషులును, జితేంద్రియులును ఈ కాలమున లేరా? అనేకులు గలరు. మనమును యత్నించిన నాస్థితిం జెందఁగలము. కళత్ర

పుత్రాదులు బ్రహ్మసాక్షాత్కారమునకు నంతరాయము లని సామాన్యముగ జనులు వచింతురు. అది నిజముకాదు. తత్త్వమెఱింగి మెలంగినవారలే, యీ పదవికి విశేష సహాయులగుదురు. ప్రతి మనుష్యునకు నాంతరముగా నుండు తత్త్వమును బ్రత్యక్షానుభవమునకుఁ దెచ్చుకొనుటయే పరిణామము యొక్క పర్యవసాన మగుచున్నది. అట్టి తత్త్వముతో నేకత్వము సిద్ధించువఱకును, పురుషుఁ డనుభవజన్యజ్ఞానమును సంగ్రహించుచుండవలయును. ప్రథమమున భార్యాపుత్రాదులతో నైక్యమును బొందఁ బ్రయత్నింపం దగును. క్రమక్రమముగఁ బ్రపంచమంతటితో నైక్యమును బొందఁదగును. పురుషుఁడు గృహస్థుఁడు గాకుండిన నన్నివిధములైన యీ కర్షణములకు లోనై యుండును. నానాదిగాగత ఝంఝూనిల సంరంభప్రసాదములకు లోనైయుండు చుక్కాణిలేని పడవభంగి వివాహముకానివాఁడు ప్రపంచమందు సంచరింపవలసియుండును. సత్యము సర్వదా యప్రియముగానుండును. లోకులెన్నఁడును సంతోషపూర్వకముగా సత్యమును గ్రహించియుండలేదు. కొంచెము కొలఁదిగా నన్నికుటుంబములును, యూరోపా, యమెరికా, యిండియా, జపాన్, మున్నగు దేశములన్నిటియందును దుఃఖభాజనములై వర్తిల్లుచున్న వని మనమెఱుంగమా? గృహములు సౌఖ్యకరములుగాక జనులు పరితాపము నొందుటేల? నిష్కపటముగా దానిమూలమును

పరీక్షించి విమర్శించిన, సంసారమందలి వైపరీత్యమునకుఁ గారణము, ప్రకృతిధర్మముల యజ్ఞానమేయని తెలియవచ్చును. అవిద్యాప్రభావంబున నిజతత్త్వంబును గుర్తెఱుఁగఁ జాలక జనులు దుఃఖభాజను లగుచున్నారు.

ముసలిముదితయొకతె యొకసాధువుదగ్గఱకు వెళ్లి తన గృహమును గుటుంబమును విడిచి శ్రీకృష్ణమూర్తి జన్మించిన పుణ్యక్షేత్రమగు బృందావనమునకుఁ బోవుట యుక్తమా యని యడిగెను. ఆ సాధువప్పు డామెకడ నుండిన చిన్నపాపనిం జూచి, యాపాపఁ డామెమనుమఁ డని తెలిసికొని "నీమనుమని నేత్రములనుండి నిన్నుఁ జూచుచున్నదెవ్వరో గమనించి గ్రహింపు" మనెను. 'అది భగవంతుఁడే యగును. ఈ ముద్దులమూటకట్టు పసిబాలుఁడు దుష్టత్వమే యెఱుఁగఁ డనఘుఁడు, పవిత్రుఁడు నగును." అని యావృద్ధస్త్రీ పలుకఁగా "నీవు బృందావనమునకు వెళ్లి యక్కడి శ్రీకృష్ణవిగ్రహమునందుం దత్త్వమును బూజించెదవు. ఇంతియ కదా? ఆ విగ్రహమునకువలె నీబాలుని విగ్రహంబునను నాతత్త్వమునే దర్శింపఁగూడదా?" యని యాసాధువు ప్రశ్నింపఁగా నాయవ్వ కొంత భ్రమ నొందెనుగాని కొంతవడి యాలోచించి తనలోఁదాఁ దర్కించుకొని యాబాలుఁడు శ్రీకృష్ణుని యవతారమని పరిగణించి యాశరీరము మూలముగ శ్రీకృష్ణునిఁ బూజింపనగునని నిర్ణయించుకొనెను. ఆ

శిశువు శరీరమందు వ్యాపించియుండి నేత్రములనుండి యవ లోకించుచు, శ్రోత్రములనుండి యాకర్ణించుచు, దేహాము నన్నివిధంబుల నభివృద్ధిం జెందించుచున్న తత్త్వమే యావృద్ధ స్త్రీ పూజింపఁదలంచిన శ్రీకృష్ణతత్త్వం బని యాసాధు వుప దేశింపఁగా నామె యా బాలుని తన మనుమనిగా నెంచక భగవంతునిగా నెంచఁదలంచెను. ఇటులు ప్రపంచమందలి ప్రతి వస్తువునందును భగవంతునిఁ జూడఁగలుగుట యభ్యసించిన సర్వసంగమును సంత్యజింప సాధ్య మగును.

రామతీర్థుఁ డిట్టిశక్తి లభించుట కెంతయో పరిశ్రమ చేసెను. తాఁ జెప్పిన విధంబుగఁ దనభార్యతో నేకత్వమును బొందుటకై ప్రథమమునఁ బ్రయత్నించెను. శాస్త్రవిహిత దాంపత్యధర్మములను రామతీర్థుఁడు నిస్సంగియై నెఱవేర్చెను. ప్రతిదినంబును రామతీర్థునిభార్య ఉషఃకాలముననే నిద్ర మేల్కాంచి, కాలోచితకృత్యంబులఁ దీర్చికొని, యప్పటికే ధ్యాననిష్ఠాగరిష్ఠుండై యుండు రామతీర్థుం డు పరమార్థదర్శ నామృత లాభమునుబొంది, భగవంతునియం దైక్యమును జెంది, దేహామునకు మనస్సునకు నతీతుఁడై యుండ నతని దగ్గ ఱకు వెళ్లి యభిముఖముగా నుపవిష్టురాలై రామతీర్థుని లలాట మందు దృష్టిని నిలిపి స్వశరీరమును మఱచినదై యుండును. భర్తృశరీరమునే ధ్యానమం దుంచి ఓంకారజపము సలుపుచు ననన్యచింతాసక్తురాలై యుండును. భర్తృ శరీరమందు

మగ్నమై యామె రూపాంతరమును బొందిన ట్లుండును. రాముని యాత్మయే తనయాత్మ యని గణించి కృతార్థతం జెందుచుండును. గాఢనిష్ఠాపరాయణురాలైన రామతీర్థుని భార్య యతనియం దైక్యమును జెంది తానే ధ్యానించుచున్నటులును, భగవదైక్యమును జెందినటులు సాక్షాత్కార సుఖము నొందుచుండును. భర్తను భగవంతునివలె, భార్య పూజింపవలయునను శాస్త్రవిధిని రామతీర్థుని భార్య యాచరణయందుంచుచుండును. పతి పరమాత్మ యని భావించు పత్నియొక్క మానసికశక్తి పతిని భగవదైక్యసిద్ధిం బొందించుటయందు సాహాయ్య మొనరించు ననియు, సాక్షాత్కార మొందిన పతివలన పత్నియు నుపకారమును బొందుచుండు ననియు, దంపతుల యాత్మైకత్వముననే వివాహ మేర్పడె ననియు, నట్టిస్థితియే సౌఖ్యతమ మైనదనియు, నానావిధాకృతి, ముఖవర్ణము, గాత్రసౌందర్యము, శరీరరూపలావణ్యములందనురక్తి కలుగుటచేఁ దటస్థమగు వివాహ సంబంధము లసౌఖ్యకరములై, పరాభవహేతువులై, పరఁగుచుండుననియు రామతీర్థుఁ డమెరికాఖండనివాసుల కుపన్యసించెను.

### అతిథిసత్కారము

వీరు భార్యాభర్త లిరువురును బవిత్రసంకల్పములు కలవారగుటం జేసి వారి యుత్కృష్టప్రభావము, సుప్రతిష్ఠానుభూతి లోకమునకు మహోపకారకముగఁ బరిణమించుచుం

డెను. సాధారణముగ జనులు తమవాత్సల్యమునకు గృహ మునే యవధిగా నుంచికొనియెదరు. రామతీర్థుండును నతని భార్యయు గృహమును తమవాత్సల్యమునకు మధ్యభాగముగఁ జేసికొని ప్రపంచమందంతటను వారి యపారమైన ప్రేమను బ్రసరింపఁజేయుచుండిరి. వీరి విశుద్ధమైన ప్రేమ యతిథియభ్యా గతి బృదంబునకు నత్యంతమైన తృప్తియు, నానందమును గలుగఁ జేయుచుండెను. రామతీర్థుని యింటికి వచ్చిన వారలందఱును జ్ఞానమును సంపాదించుకొని వచ్చినప్పటి కన్న ఘనమైన స్థితియందు వెళ్లుచుండురు. ఇట్లొనర్చుట వారలకు ముఖ్యమైనధర్మం బని వారిరువురును దలంచు చుండిరి. మృష్టాన్న మృదుశయ్యల సమర్చుటయందే తృప్తిం జెందక తమ యింటికి వచ్చినవారికి నంతకన్న మిన్నయగు జ్ఞానబోధ నొనరించుచుండిరి. తను యఖండప్రేమను వారికి పంచియిచ్చుచుండిరి. రామతీర్థుని యాతిథ్య మనంతమై యన శ్వరమై సదానందదాయకంబైన విశుద్ధప్రేమగా నుండెను.

## ఆత్మసాక్షాత్కారము

మొట్టమొదట రామతీర్థుఁడు శాస్త్రీయ బ్రాహ్మణుఁ డుగ నుండి సనాతనధర్మసభలందు భక్తిని గుఱించియు, శ్రీ కృష్ణమూర్తిని గుఱించియు నుపన్యసించు చుండెను. అట్టి సమయములం దతని నేత్రముల నుండి బాష్పములు జల జల రాలుచుండెను. ఆధ్యాత్మికవికాసము నొందుచున్న యా

యవస్థయం దనేక పర్యాయములు కాలాహిఫణామణుల మీఁద నృత్యము సేయుచు, నధరతలంబున నున్న పిల్లన గ్రోవిని ముఖమారుతంబునఁ బూరించుచు, నీలమేఘశ్యామ సుందర విగ్రహుండు, భక్తానుగ్రహుం డగు నా కృష్ణుండు ముఖాముఖిగ నిలుచుచుండ నుత్ఫుల్లనయనంబులతో ననన్య చింతతో నా భగవంతునిఁ దా దర్శించెనని రామతీర్థుఁడే వచించెను. ఇయ్యది చిత్తైకాగ్రతయం దొక విశేషావస్థ యనియు, భావనాబల మనియు, రామతీర్థుఁడు నుడివెను.

సంపూర్ణమైన యాత్మసాక్షాత్కారము నొందుటకై రామతీర్థుఁ డహోరాత్రములు కృషిచేసెను. రావీనదీతీర మున ననేకరాత్రులు చిత్తైకాగ్రతకు వలయు నాధ్యాత్మిక వ్యాయామములను రామతీర్థుఁ డభ్యసించుచు వచ్చెను. అనేకరాత్రు లతని ప్రక్కమీఁది దుప్పటి రామతీర్థుని కన్నీళ్లచేఁ దడిసియుండుట యతనిభార్య గమనించుచుండెను. లాహూరు నగరమందు కుటుంబముతో నుండిన కాలములో తటిదైనప్పుడెల్ల హిమాలయ ప్రాంతమందలి యరణ్యాము లకు రామతీర్థుఁడు వెళ్లుచుండెను. అక్కడ నుపనిషత్సార విమర్శముం గావించుచు బ్రహ్మవిద్యా రహస్యములను గ్రహించుచుండెను. హృషీకేశముదగ్గఱ నుండు బ్రహ్మపురి కాంతారంబులందుఁ గడపట రామతీర్థుఁ డాత్మసాక్షాత్కార ముం బొందెను. ఆయన కష్టములు గట్టెక్కెను; కృతార్థుఁ

డయ్యెను. ఇట్టి కృతార్థతం జెందిన పిమ్మట రెండు సంవత్స రములు తనభార్యతోఁ గాఁపురముచేసి రామతీర్థుఁ డామెకు వేదాంతమా నుపదేశించెను. గురువైన భర్తను బూజించు టకై పుష్పములు దీపధూపములు సమకూర్చుకొని యామె శ్రద్ధాభక్తులతో నతనినిఁ బూజించుచుండెను. కొంచెము దూరముగఁ గూర్చుండి భర్తృశరీరముపై దృష్టిసారించి తచ్ఛ రీరము లక్ష్యముగువఱకును నటులఁజూచి ఓంకారమును జపము చేసి భర్తయందలి యాత్మను ధ్యానించి, తనలోఁ దానే భగ వంతు నవలోకించుచు రామతీర్థునిభార్య యానంద మనుభ వించుచుండెను. రామతీర్థుఁడు దాఁ గృతార్థుఁ డగుటయే కాక, తన భార్యను గూడ కృతార్థురాలినిగా నొనర్చెను. ఇట్లింగి జితేంద్రియులై దేవభావములనే నుఱచి వారిద్దఱును బంధవిముక్తులై జీవన్ముక్తులైరి. ఇద్దఱును నిష్కాములై యాత్మానుభవానందము ననుభవించుచుండిరి.

## సన్న్యాసము

1898 సంవత్సరాంతముననో, 1899 సం॥ము ప్రారం భముననో, లాహోరు నగరమును విడిచి రామతీర్థుఁ డరణ్యావాసమునకై వెళ్లెను. 1899 సంవత్స రాంతమందు రామతీర్థుఁడు సన్న్యాసాశ్రమమును స్వీకరించెను. రాను తీర్థుఁడు లాహోరు నగరము విడిచి వెళ్లినపుడు పరిషియర్ భాషయందు రచియింపఁబడిన విష్ణుపురాణమును జదువు

చుండెను. పరిషియర్ భాషనుండి యీ పురాణము పంజాబీ భాషలోనికి భాషాంతరీకరింపఁబడెను. పంజాబీ విష్ణుపురాణమునకన్న విశేషముగ నల్లకంబళి బావాజీగా రనుభవ ప్రకాశ మను గ్రంథమును రచించిరి. ఇందా నల్లకంబళి బావాజీయొక్క మానసిక, ఔన్నత్యము, ఔదార్యము, మాహాత్మ్యము, కనఁబడుచుండును. ఈ మహాత్ముని ప్రభావంబున నెన్నియో ధర్మశాలలు, వంతెనలు, పాఠశాలలు, మున్నగు ధర్మకార్యంబులు నేఁటివఱకును పంజాబుదేశమందు జరుపఁబడుచున్నవి. ఈ మహాత్ముని యనుభవ ప్రకాశమే రామతీర్థుని యాత్మసాక్షాత్కారమునకుఁ దోడయ్యెను.

1902-వ సంవత్సరము మధ్యభాగమువఱకును రామతీర్థస్వామి నదీతీరము లందును, నిర్జనారణ్యము లందును, హిమాలయ శిఖరములందును, నాత్మధ్యానపరాయణుఁడై కాలము గడపుచుండెను. చైతన్యుని ప్రేమానందభరము, తుకారాం నానక్కుల మాధుర్యము, కబీరు ఫరీదుల యాత్మైకాగ్రత, ప్రహ్లాదధ్రువులభక్తి, యన్నియు రామతీర్థుని యందు మూర్తీభవించియుండెను. సర్వదా ధ్యానశీలుఁడై రామతీర్థుఁ డాత్మానుభవానందమును గ్రోలుచుండెను. గంగానది యుద్భవించిన స్థానమునుండి, సాగరసంగమము వఱకును రామతీర్థుఁడు దినమునకు 40 మైళ్ళచొప్పున నిష్కాముఁడుగను పవిత్ర హృదయుఁడుగను, పాదచారియై వెళ్లి మహా

త్మల దర్శనలాభముం బొందెను. ఈ సంచారమందు రామతీర్థుని కెదురుగాఁ బెద్దపులులు నెలుఁగుబంటులుఁ దోఁడేళ్లు మహాసర్పములు వచ్చెనుగాని రామతీర్థుఁడు కొంచెమైనను జంకలేదు. నిర్భయముగా వానియందలి తత్త్వము నతఁడు గమనించుచుండఁగ నవియు రామతీర్థుని సేవించి మెల్లగాఁ దిరిగి వెళ్లుచుండెను. నిర్భయముగా నుండినఁ గీడెంతమాత్ర మును సంభవింపదు. హిమాలయపర్వతములందలి యరణ్యములందు రామతీర్థుఁడు సంచరించుచుండఁగా, నొకపర్యాయ మొకయెలుఁగుబంట్లు వచ్చి రాముని దారుణమైన చూపులతోఁ జూచెను. రాముఁడు తిరిగి వానియందలి తత్త్వమును వాని నేత్రములనుండి యవలోకించెను. అవి యెట్టిహానియు నొనరింపక మరలిపోయెను. ఇది యంతయు రాముని నిర్భయత్వమువలననే కలిగ నని జయముయొక్క రహస్యమును నుపన్యాసమందు 1903 సంవత్సరం జనవరి తే 26 దిన స్వర్ణకవాటభవనమందు రామతీర్థస్వామి అమెరికా దేశస్థులకుఁ జెప్పెను.

"శ్లో॥ నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
నచైనం క్లేదయన్త్యాపో నశోషయతి మారుతః॥"

"ఆత్మను శస్త్రములు ఛేదింపఁజాలవు. అగ్ని దహింపఁ జాలదు. ఉదకములు తడపంజాలవు. వాయు వెండింపఁ జేయఁజాలదు" అను భగవద్గీతావాక్యమందలి యాత్మస్వ

రూపమును నిరూపింప సామర్థ్యము గలిగిన రామతీర్థస్వా మికి భయ మేల కలుగును?

గంగాతీరంబున నొకనాఁడు రామతీర్థస్వామి కూర్చుండి వెల్లువ వచ్చుచుండఁగఁ గనుచుండెను. ఉభయపార్శ్వము లందునుండు చెట్లు, చేమలు, పుట్టలు, పొదలు, క్రమక్రమ ముగ మునుఁగ నారంభించెను. అప్పు డక్కడ నొక్కమహా వృక్షముండెను. ఆవృక్షశాఖలమీఁద నొకకోఁతి తన బిడ్డల తోఁ గూడ నివసించుచుండెను. వఱదవచ్చినది మొదలా చెట్టు నకు నీరు తగిలి క్రమక్రమమున నీరు హెచ్చి కొమ్మలవఱకు నీరెక్కెను. కడపట ఆకోఁతి కూరుచుండిన కొమ్మకు నీరుతగి లెను. ఆకోఁతులన్నియు భయముఁజెంది చెట్టుకొననుండిన శాఖపై కెక్కెను. చిన్నకోఁతులన్నియుఁ దల్లిదగ్గఱఁ జేరెను. రామతీర్థుఁ డావిషయమును గమనించుచు నాకోఁతులను సం రక్షించు నుపాయము గానలేక పరితాపపడుచుండెను. వెల్లు వ హెచ్చిహెచ్చి యుదకము వృక్షాగ్రమునంటెను. ఆపిల్లకోఁ తులు తల్లిం జేరి కౌఁగిలించుకొని వ్రేలాడుచుండెను. ఆపెద్ద కోఁతికాలిక్రిందికి నీరువచ్చెను. ఏవంకఁజూచినను నీళ్లతో నిండి యుండుటం జేసి తప్పించుకొను నుపాయముఁ గానక యమిత భయమునొందినయావానరముతనబిడ్డలగునాచిన్నకోఁతులలో నొకదానింబట్టి కాలిక్రింద వేసికొనెను. ఇంకను నీరుహెచ్చెను. మఱియొకబిడ్డనుబట్టి బలవంతముగాఁ దిరుగఁ దన కాలిక్రింద

వైచికొనెను. ఇంక నావఱద యధికమయ్యెను. మూఁడవ బిడ్డనుగూడ నదేవిధంబుగఁ గ్రూరంబుగాఁ దనకాలిక్రింద వైచికొని దానిపైఁదనకా లుంచెను. తనబిడ్డలప్రాణములకన్నఁ దనప్రాణము హెచ్చయ్యెను. స్వశరీరమునకుఁ గష్టముగలుగ కుండునంతవఱకు బిడ్డలయందు ప్రేమయుండును. తనప్రాణమునకు హాని కలుగనుండిన, సామాన్యజనులలో నేమానవుఁ డైనను నాలిని బిడ్డలను ధనమును సర్వమును సంత్యజింప సిద్ధపడును. తనప్రాణ మెంత తీపయ్యె నావానరమునకు! ఇదియే ప్రపంచస్వభావము. ఆకోఁతికి సౌఖ్యము తనయందుఁ గాక తనబిడ్డలయం దుండిన, నట్టి సౌఖ్యము నిచ్చు బిడ్డలఁ జేతులార వఱదకు నొప్పగించునా? లోకమం దందఱికిని సౌఖ్యము సౌఖ్యమనునది వారివారి మనోభావములందుఁ బుట్టుచున్నది గాని వెలుచోట వాస్తవముగఁ గలుగుట లేదు. రామతీర్థుఁ డీవిషయమును సాన్‌ఫ్రాన్‌శిస్కో నగరమందు శాస్త్రపరిషత్భవనంబున 1902వ సంవత్సరంబున డిసంబరు తే 17 దిన ఆదేశస్థులకు నుపన్యసించెను.

ఇంకొకప్పుడు రామతీర్థుఁడొక స్వామిని (సన్న్యాసిని) జూచెను. ఆమహాత్మున కొక పెద్దకురు పుండెను. ఆకురుపు పుండయ్యెను. ఆపుండు చీముచేఁ గప్పఁబడి యమిత దుర్గంధమును వ్యాపింపఁజేయుచుండెను. ఆకంపున కా పుండునందు బెక్కుపురుగులు జన్మించి, కుళ్లిన పుండుస్థలమందు లుకలుక

లాడుచుండెను. ఆ పురుగు లాంఛీమును ద్రాగుచు బలిసి యామహాత్ముని కుళ్లిన శరీర భాగమునుండి క్రింద జలజల రాలుచుండెను. పురుగులు నశించుట కెట్టి యౌషధము నైన నాస్వామి యుపయోగింపకుండెను. అంతియగాక క్రిందఁ బడుచున్న పురుగులను దీసి తిరిగి పుండునందుంచుకొనుచుండిన యాస్వామి ఈషన్మాత్రమైనను బాధనొందకుండ, పక పక నవ్వుచు "ప్రపంచమందుండు ప్రతి క్రిమికీటకమునకును నాశరీరమునందు స్వాతంత్ర్యము కలదు. ఈ విశాలప్రపంచ మంతయు నాదేయగును. విశ్వమంతయు నాశరీరము, గాలియు భూమియు నాకు నుడుపులు, చెప్పులునై యున్నవి." అని చెప్పుచుండెను. ఈస్వామి బ్రహ్మసాక్షాత్కారముం జెందిన సన్న్యాసిగాన, నమితోల్లాసముతోఁ దనశరీరము నీఁగలకును క్రిమికీటకములకును, నాహారముగ నివేదించెను. ఇది యత్యద్భుతము గదా ?

భగవంతుని యందలి ప్రేమయొక్క స్వభావమును దెలుపుటకై రామతీర్థుఁ డిక్రిందివిషయమును వివరించెను. పూర్వకాలమున మనదేశంబున దీపముల నుంచుటకు మట్టి ప్రమిదలే యుపయోగపడుచుండెను. ఒక యింటివారు తమ గృహమందలి దీపములను వెలిఁగించినతోడనే, యాకాలమం దిప్పటివలె నిప్పుపెట్టెలు లేనందున కడమ యిండ్లవారలందఱు నాయింటికి వెళ్లి తమదీపములను వెలిఁగించుకొనుచుం

౫౯. ఒకానొకదినమందు బృందావనమందుండిన చిన్ని బాల కృష్ణునియం దధికమైన యనురాగము కలిగినయొకకన్యక, దీప మును వెలిఁగించుకొని వచ్చెడి నెపంబున చమురువత్తి గల ప్రమిదను జేతఁబుచ్చుకొని కృష్ణునితండ్రి యగు నందుని యింటికి వెళ్లెను. ఇంక నెన్నియో గృహములందు దీపములు వెలిఁగించి యున్నను నందునియింటికే యాకన్యక వెళ్లుటకుఁగారణము ముద్దులుమూటగట్టెడు శ్రీకృష్ణమూర్తి యొక్క దివ్యసుం దరవిగ్రహమును గన్నులపండువుగఁగనటులు చూచుటకేయై యుండెను. నందుని యింటికాకన్యక వెళ్లెను. ప్రమిదలో వెలుఁ గుచున్న దీపమునందు దాఁదెచ్చిన ప్రమిదలోనివత్తిని వెలిఁగిం చుటకై దీపముదగ్గఱకుఁ బోవుచునను నాబాలిక కన్నులాదీప మందుండక బాలకృష్ణుని మోమువైపు తిరిగెను. అతిమోహన మై యానందకరమైన యాననము నవలోకించుచుండఁ బ్రేమాతి శయంబున నాకన్యక మనంబు కృష్ణుని శరీర లావణ్యమునందు మగ్నమైయుండుటంజేసి వత్తికి బదులు తన వ్రేళ్లంటుకొని కాలుచున్నను ఆ బాలికకుఁ దెలియకుండెను. ఆ బాలిక శరీర మును వదలి బ్రహ్మానంద మనుభవించుచుండెను. దీపము వెలిఁగించుకొని వచ్చుటకై వెళ్లిన కొమార్తె యింకను రా కుండుటకుఁ గారణమేమై యుండునో యని యా కన్యక తల్లి తలంచి, దిగులుఁజెంది, యా పిల్లను వెదకఁ బ్రారంభించెను. ఇరుగు పొరుగున నుండిన యిండ్లకు వెళ్లి పిల్లను గానక కడు

పట నందుని యింటిలోనికి వెళ్లి, దీపమందు చేతి వ్రేళ్లు తగులఁ బడి, వంకర తిరిగి బొగ్గులగుచుండినను దెలియకుండిన తన కొమార్తెను జూచి యేమియుం దోఁపక, నోటఁదడిలేక, మాట రాక, భోరున నేడ్వసాగెను. కొంతసేపటికి బాలికకుఁ దెలివి వచ్చెను. ఇయ్యది పరిపూర్ణమైన ప్రేమను ప్రబోధించు చున్నది. గోపికాస్త్రీలకు శ్రీకృష్ణునియం దుండిన గాఢాను రాగమునకు విశుద్ధమైన ప్రేమయే మూలాధారముగా నుండెను. "త్వమేవాహం" (నీవే నేను) అను భగవంతునికి నాత్మకును గల సంబంధ మనుభవమునకు వచ్చినపుడు కలుగు మానసికస్థితిని దెలియ జేయుటకై పై సంగతిని రామ తీర్థుఁడు నిదర్శనముగ అమెరికాదేశ నివాసులకు 1902-వ సం॥రము డిసంబరు 6-వ తేది శనివారమునాఁడు సాన్‌ఫ్రాన్ శిస్కో నగరమున యతిసమాజ భవనమందు "మతముయొక్క యుద్దేశ్యము" అను విషయమై యుపన్యసించుచుఁ జెప్పెను.

హిమాలయ నివాసము

హిమాలయ పర్వతము లందు నయ్యాములకుఁ బేరు పడిన యొకగుహ కలదు. ఆ గుహకుఁ జుట్టుప్రక్కల నుండు పల్లెలలో నుండిన జనులు "అనేక యతు లొక్క రాత్రికే పరలోకగతులైరని రామతీర్థునితోఁ జెప్పిరి. ఆ గుహయొక్క వృత్తాంతమును విని మూర్ఛనొందిన యాత్రికులు కొంద ఱుండిరి. ఆ గుహలో నివసింపఁదలంచితి నని రామతీర్థుఁడు

పలుకఁగా వార లందఱు నాశ్చర్యమును జెందిరి. చెప్పిన విధంబుగా, మాటతప్పని రామతీర్థుఁడా గుహాయం దనేక మాసము లుండెను గాని ఒకదయ్యమైనను, ఒకనిడమైనను, నతనికిఁ గానరాకుండెను. మహాత్ములం జూచి దయ్యములు తొలఁగకుండునా ? దయ్యములు కనఁబడకున్నను లోపలఁ బాములు, తేళ్లును, వెలుపల వ్యాఘ్రములు నుండెను. ఇవి యెవ్వియు రామతీర్థుని కెట్టిహానియుఁ గలిగింపలేదు. రామ తీర్థునికి దయ్యములున్నవని యభిప్రాయము కలదు. ముక్తపురు షులు చచ్చినపిమ్మటఁ దిరిగి దయ్యములై బ్రతికియుండరనియు, బద్ధులగు వారిలో ఇంద్రియములకు బానిస లైనవారలు దయ్యపు వేషమున శరీరమును విడచియు నుందు రనియు రామతీర్థునికి నమ్మకము కలదు.

హిమాలయారణ్యములందు వసించుచుండు సాధు వులు ఓంకారమును మననము చేయుచుందురు. మఱి దేనినైనను బాడుచు సంగీతవాద్యములను వాయించుచుందరు. అనేక పర్యాయము లా యడవులలో నుండు సర్పములు, జింకలు, అడవిమృగములు, తమనెలవులను విడిచి యా సాధువుల దగ్గ ఱకు నట్టి సమయములందుఁ జేరుచుండును. సంగీతవిషయమే తెలియనట్టియు ఓంకారమే గుర్తెఱుంగ నట్టియు నా మృగములమీఁద విచిత్రమైన ఫలితమును కేవలశబ్దమే కలు గఁజేయుచుండఁగా సరియైన కాలమం దా శబ్దమునే విడువక

యుచ్చరించుచుండిన మనకు మేలు కలుగకుండునా? ఓంకారము నుచ్చరించుట, భావించుట, కార్యమందు వినియోగించుటలు కలిగిన మనుష్యులందఱును లోకమునకు భగవంతుని వలె నుండెదరు. త్రికరణశుద్ధిగా ఓంకారజపము సలుపుచుండుటచే మహాఫలితములు కలుగు ననియు, ఓంకారభావమును గుర్తెఱుంగక పోయినను కేవలోచ్చారణమువలన నేలాభము కల దనియు రామతీర్థుఁడు వచించెను, పైని నుడివిన సాధువులను సామాన్యులకలవిగాని పుణ్యక్షేత్రములను, ఋష్యాశ్రమములను, మహాత్ములను సందర్శించుచుఁ బ్రశాంత చిత్తముతోఁ బవిత్రహృదయముతో హిమాలయారణ్యములందు మునులతోఁ జేరి బ్రహ్మనిష్ఠుఁడై వరఁగుచుండెను. ఒకనాఁడు రామతీర్థుఁడును నా మునులును సభ చేరి స్వస్వరూపానుసంధానము చేసికొనుచుండిరి. అట్టి సమయమునం దొకఁడక్కడికి వచ్చి రొమ్ము కొట్టుకొనుచుఁ బెద్దపెట్టున నేడ్వసాగెను. ఒక్కరు నాతనివంకఁ జూడరైరి. రామతీర్థుని పుత్త్రుని మరణమునకై, యా బాలునికి బంధువైన యామనుష్యుఁడు దుఃఖించుచు రామతీర్థుని కావార్త తెలుపుటకై యక్కడకు వెళ్లెను. ఎవ్వరు నతనివంకఁ జూడనందున నతఁడు కూర్చుండెను. కొంతసేపటికి అతనితో నెమ్మదిగా, శాంతముగా విశదముగా రామతీర్థుఁడు మనస్థైర్యమును జెందమని చెప్పఁగా రామతీర్థుని కుమారుని మరణమువలనఁ దనకుఁ గలి

గిన దుఃఖమును భరింపఁజాలనని యతఁడు నుడివెను. ఆసభలో నుండిన వారికేరికైనఁ గొంచెమైనను జలనము కలుగలేదు. వారలందఱు ఆసమయంబునఁ బ్రతివస్తువును భగవత్స్వరూపముగ నెన్నుచుండిరి. భగవంతునిదప్ప మఱెద్దియు వారు చూడఁజాలకుండిరి. దైవతత్త్వమే యెల్లెడల వారికిఁ గనఁబడుచుండెను. రామతీర్థుఁ డిక్రింది విధంబునఁ బలికెను. "సోదరా! ఆ చనిపోయిన బాలునికి నీవు సంబంధివని వచించుట యెవరోవచ్చి అయ్యో' గాలివీఁచుచున్నది, నదులు పాఱుచున్నవి అని చెప్పినట్లున్నది. గాలివీచుచున్నను, నదులుపాఱుచున్ననునేమి? అది స్వభావమేకదా? కలఁతనొందవలసిన కారణమేమున్నది? ఇందులో వైపరీత్య మేమియు లేదు. అదేవిధముగా నీవువచ్చి నాకొమారుఁడు మృతినొందెనని చెప్పుటచే విశేష మేమియుఁ గానరాకున్నది. ఇదియు స్వభావధర్మమే కదా? పుట్టిన వారెల్లఁ జచ్చుటకే కదా జననం బొందుట? కళాశాలయందుఁ జేరినపు డందు సర్వకాల ముండవలయునని చేరుదుమా? ఒకతరగతి గడచిన పిమ్మట దాని పైతరగతికి వెళ్లమా? మిద్దెమీఁదికిఁ బోఁబ్రయత్నించిన మానవుఁ డొక మెట్టెక్కి యక్కడనే కూరుచుండియుండునా? మెట్టుపై మెట్టెక్కి యొక్కక్షణములో నామేడ నెక్కఁడా? ఒకజన్మమును విడిచినంగదా యింకొకజన్మ మెత్తుట? ఈశరీరమును బ్రవేశించినపుడు దానిని విడువవలసియుండునని మనకుం దెలియదా?

కాఁబట్టి రాముని కుమారుఁడని నీవు చెప్పెడు బాలుఁడు పర లోకగతుఁడైన నయ్యది స్వభావమేకదా? ఇందేచిత్రమును లేదు. ఇది క్రొత్తసంగతి కాదు. దీనివలన నీవు కలఁతఁజెందఁ గూడదు. గోల్డీదినమున దీయించుకొంటి నని చెప్పినవిధమే కదా నీపుత్త్రునిఁ బోఁగొట్టుకొంటి వని నుడువుట? పుత్త్రుఁడు శరీరమునువిడిచెను. మంచిది. ఇందు వైచిత్ర్యమేమియుఁ గనం బడదు. ప్రాపంచికవిషయము లన్నింటి నిదేవిధముగ భావిం చుచు బంధములేకుండ ప్రవర్తింపవలయును ఈవిషయము రామతీర్థుఁడు 1903-వ సంవత్సరము ఫిబ్రవరి 26 తేదిన అమెరికా దేశస్థులకుఁ జెప్పెను ఇందువలన రామతీర్థునికొక కుమా రుఁడు కలిగననియు, నాకొమారుఁడు రామతీర్థుఁడు సన్న్యసిం చిన పిమ్మట మృతి నొందెననియు మనము గ్రహింపఁదగి యున్నది.

రామతీర్థుఁ డాత్మధ్యానపరాయణుఁ డై, తత్త్వ ముసాక్షాత్కారమునకుఁ దెచ్చుకొని హిమాలయశిఖర ములం దఖండానందము ననుభవించుచుండెను. అట్టి సమ యమున నొకదినంబున నొకఁడు రాముని దగ్గఱకువచ్చి "ఓ, అయ్యా, మిమ్ములను సందర్శించుటకు ఒకగొప్ప రాజకుమా రుఁడు వచ్చుచున్నాఁడు" అని చెప్పెను. "ఆయనవచ్చిన రాముని కేమి?" అని రామతీర్థుఁడు అనెను. "అయ్యా మీసన్నిధికి వచ్చుటకై, వెలగలిగి సుందరములైన, దేదీప్యమానములైన,

వస్తువులను గొనఁబోవుచున్నాఁడు." అని యతఁడు బదులి డెను. "నాకవి యెందుకన కేమి చేసికొనుటకు? రాజకుమారుఁ డైననేమి, యెవ్వరైన నాకేమి? నాకు సత్యము మాత్రము కావలయును. ఈ మిథ్యావస్తువులు క్షుద్రములు, నిరర్థకములు. నాకు వీనియందుఁ బ్రీతి లేదు. నాసత్యము, నాయానందము, నాయాత్మ యివియే నాకుఁజాలును. తుచ్ఛములైన ప్రాపంచికవిషయములందు నాకేమి సంబంధమును లేదు. ఈ రాజపుత్రు ధనవంతులు, రాముని శరీరము దగ్గఱకు వచ్చెదరు. ఈ శరీరములందు రాముని కనురాగము లేదు. రాజాధిరాజులైనను జక్రవర్తులైనను సార్వభౌములైనను నాకేమి లాభము చేయఁగలుగుదురు? లాభము నాకేమి కావలయు" నని రామతీర్థుఁడు పలికెను.

హిమాలయమందలి మహారణ్యములందు రామతీర్థుఁడుండఁగా నతని మన స్వభావాత్మకమై, నిర్మలమై, నిశ్చలమై యుండు సహృయములందు ప్రశస్తములైన భావములమోఘములైన తత్త్వము లత్యద్భుతమైన శక్తిఁ గలుగుచుండెను. ఇవన్నియు నీశ్వరప్రచోదితములే యగును.

## గంగోత్తరీవాసము

రామతీర్థుఁడు గంగోత్తరిలో 1901-వ సంవత్సరము ఆగస్టునెలవఱకుండి యక్కడినుండి "జమ్నోత్తరి"కి వెళ్లి యక్కడ నొక నెలదినము లుండెను. గంగను వదలిన నెల

దినము లేండ్లు పూండ్లు గడచిన విధంబుగ నుండుటంజేసి రామతీర్థుఁడు తిరిగి గంగో త్తరికై బయలుదేఱెను. సహజముగా యాత్రికులు "జమ్నో త్తరి" నుండి గంగో త్తరికి 10 దినములకు పైఁగా నడిచి వెళ్లుచుందురు. అట్లుగాక రామతీర్థుఁడు జమ్నో త్తరి వదలి మూఁడుదినములలో గంగో త్తరిం జేరెను. అది యడవిమనుష్యులు పోవునట్టి శాట. ఈ దారిని గొండమనుష్యులు తప్ప మఱెవ్వరును వెళ్లరు. దీనికి ఛాయామార్గ మని పేరు. కొండ కాపు లావిధముగ నామార్గమును పిలుచుచుండెదరు. మూఁడు రాత్రులు నిర్జనమైన గుహాంతరములంగు రామతీర్థుఁ డుండవలసి వచ్చెను. ఆ త్రోవలో నొక్క పల్లెయైనఁ గానరాదు. ఒక్క గుడిసెయైనఁ గనఁబడదు. ఆ మార్గముకొనవఱ కొక్క మనుష్యుఁడైనను గోచరముకాలేదు. సంవత్సరమునం దంతయు నామార్గము ఛాయలచేఁ గప్పఁబడి యుండుటచే ఛాయామార్గ మని దానికిఁ బేరు కలిగెను. ఈ ఛాయలు వృక్షములవలనఁ గలిగినవి కావు. అట్టి యున్నతమైన శిఖరములం దట్టి యతిశైత్యప్రదేశమందు వృక్షము లుండునా? ఈ బాట మేఘములచే నావరింపఁబడి యుండును. జమ్నో త్తరి గంగో త్తరి సమీపమున నుండు నడవిపల్లెలలోని గొల్లవాండ్రు తమ గొఱ్ఱెలమందలను మేపుటకై తీసికొనివచ్చి యడవులలో సంవత్సరమునకు రెండుమూఁడు నెల లుంచెదరు. వార లీమార్గము

నెఱుంగుదురు. యమునాగంగానదుల యొక్క యుద్భవప్రదేశముల సంగమ మిందుండు బందర్‌పచ్ హనుమాన్ ముఖ యనుపేర్లు గలిగి మంచుతోఁ గప్పఁబడి యుండు పర్వతశిఖరములదగ్గఱ రామతీర్థుఁ డాగొల్లవారిని గలిసికొని నపుడు వారివలన నా మార్గమును గనుఁగొనెను. పుష్పసమృద్ధిచే నా మార్గ మంతయు సువర్ణమయమైనగుడ్డ పఱచినట్లుండెను. అక్కడ పసుపు పచ్చసిపూలు, "ఊదా" రంగు పుష్పములు, ధూమ్ర వర్ణంపుఁ బ్రసూనములు నతి బహుళముగా నుండెను. కస్తూరివిరులు, నీలలోహితకుసుమములు, సువాసన గల సుమములు, చిత్రవిచిత్రవర్ణములు గల సూనములు, సాలా మిస్రీ మొదలగు నోషధు లనేక వర్ణముల మచ్చలు కలిగిన యాకులు గల తీఁగెలు, కుంకుమపువ్వు, మొదలగు మధురపరిమళము గల ద్రుమము లన్నియుఁ జేరి యా పర్వత శిఖరముల నుద్యానవనములం జేయుచుండును. ఎక్కడఁ జూచినను సుందరత్వ మొలుకుచుండును. మలయమారుతము శోభాకరములైన వర్ణములు గల పుష్పములను ముద్దిడుచు మెల్లఁగా వీచుచుండును. పుష్పసువాసన లొకటి వెంబడి యొకటి యైనను మిశ్రమములయ్యును, మనము కోరకయే మనల నెడతెగక సేవించుచుండును. మహత్తరములైన యామహీధరశిఖరములమీఁద నానావిధములైన రత్నకంబళములు పఱచినటులు పుష్ప

భాహుళ్యము గనఁబడుచుండును. ఆ శిఖరభూములు దేవతలకు, దేవాంగనలకు నృత్యరంగములుగా నుండనోపు. జల జల మని పాఱుచుండు కొండసెలయేళ్లును గొండ నెత్తముల నుండి క్రిందిపల్లపు భూములకుఁ బఱచు ఘోషము చేయు నదులును నక్కడ మెండుగ నుండును. కొన్ని పర్వతసానువుల నెక్కి నలుదిక్కులం జూచిన నెంతదూరం బైనఁ గాంవచ్చును. అడ్డ మొద్దియు నుండదు. పర్వతములు గాని, మేఘములు గాని, మన దృష్టికి నాటంకము కలుగఁ జేయలేవు. కొన్ని పర్వతాగ్రము లాకాశమును దూఁటు పోవుచుకొని పోయిపోయి, యగోచరములై యున్నవి. ఇట్టి పర్వతరంగ మందు గంగాప్రవాహము కన్నుల కెదురుగా నుండునట్టి యొక తోఁపులోఁ బచ్చికబయళ్లలో నుండు కుటీరమునందు రామతీర్థుఁడు నివసించుచుండెను. రామతీర్థునితో నిద్దరు శిష్యులుండిరి. నారాయణ, తులారాం అని వారి నామములు. వారిద్దఱును ఇంకొకదిక్కున నుండిరి. ఈ కుటీరమం దుండిన రామతీర్థునికి శకుంతసంతానంబు సహవాసమై యుండెను. ఆ ప్రదేశము చల్లగా నుండినను మంచియారోగ్యకరమైనదిగా నుండెను. గంగాప్రవాహగానము దేవదారుతరుగీతము విహంగగణకూజితము రామతీర్థునికిఁ బ్రకృతిరహస్యసంభాషణములయ్యెను. ఇచ్చోట గంగానదియొడ్డు కడు విశాలముగా నుండును. ప్రవాహ మతివేగవంతముగా నుండును. అయిన

నా ప్రవాహమును రామతీర్థుఁ డనేకపర్యాయములు దాఁటి యుండెను. సమీపములో నుండిన కేదార, బదరీ శిఖరము లకు రామతీర్థుఁ డనేకపర్యాయములు వెళ్లి యుండెను. రామతీర్థుని వియోగముయొక్క తలంపే గంగాదేవికి దుఃఖ కరముగ నుండెను. ఆమె కాయాసము కలిగించి ఖిన్నత్వము కలిగించు టెంతమాత్రము రామతీర్థుని కిష్టము గాకయుండె ను. పుట్టినప్పుడే చనిపోయిన తల్లిని గుర్తెఱుంగక పోయినను, గంగాదేవిని దన తల్లిఁగా రామతీర్థుఁడు భావించుచుండెను.

## సుమేరూదర్శనము

జమ్నోత్తరి గుహాయందు రామతీర్థుఁడు నివసించు చుండఁగా దినమునకొకపరియాహారము పుచ్చుకొనుచుండెను. ఉర్లగడ్డలు (బంగాళాదుంపలు) మిరియములపొడి యతని కాహారమయ్యెను. ఈ భోజన మతని కజీర్తిని గలుగఁజేసెను. దినమున కేడుమాఱులు ప్రవర్తి యగుచుండెను. ఆ విధముగ మూఁడుగోజులయ్యెను. ఇట్టి యనారోగ్యస్థితియందు నాలవ దివసంబునఁ దేఁకటితో నచ్చట నుండిన యుష్ణగుండములలో స్నానంబు గావించుకొని, కౌపీనధారి యై సుమేరుదర్శనము నకు బయలుదేఱెను. పాదరక్షలు గాని, తలగుడ్డ గాని, గొంగడి గాని, యతనికి లేకుండెను. అక్కడ నివసించు దృఢ గాత్రులగు నయిదుగురు కొండమనుష్యులు బొచ్చుటుడుపు లను ధరించి యతనివెంటఁ జనిరి. అతనిశిష్యులగు నారాయణ

తులారాము ఘూర్నాలి గ్రామమునకుఁ బంపఁబడిరి. ప్రథమం బున, శైశవంబున నున్న యమునానదిని మూఁడు నాలుగు పర్యాయములు దాఁటవలసివచ్చెను. యమునాతీరగహ్వార మును వార లంతటఁ జొచ్చిరి. కొంతదూరము నడువఁగా నక్కడ బ్రహ్మాండమైన గండశైలమువంటి మంచుగడ్డ యడ్డ ము వచ్చెను. ఆ గడ్డ 45 గజముల యెత్తు ఒకటిన్నర ఫర్లాంగు పొడవు గలిగియుండెను. ఇరు పార్శ్వంబులందు నున్నతమైన గోడలవలె దురారోహంబులైన పర్వతంబు లుండెను. రామ తీర్థుని యుద్యమంబునకు భంగంబు గలిగింపనెంచి యచ్చట నాపర్వతంబు లావిధంబుగ నుండె ననందగి యుండెను గాని బలిష్ఠమై వజ్రసమమైన యతని సంకల్పశక్తి ముందఱ నెట్టి యాటంకములైనఁ బటాపంచలై పోకుండునా? పడమటివైపున నున్న పర్వతము నెక్కుటకుఁ బ్రారంభించిరి. అక్కడక్కడఁ గాలూనుటకుఁ బట్టులేకుండుటచే "చా" అనుపేరుగల మెత్తని కొండగడ్డియొక్క సన్నని పోఁచలలో కాలి బొటనవ్రేళ్లను దగిలించికొనవచ్చును. దుర్బలమైనగడ్డిపోఁచలనే యాధారము చేసికొని శరీరభారమును వానిపై నుంచుటకు వీలులేనివారలై సువాసన గలిగినను, ముండ్లు కలిగిన గులాబీపొదల కాఁడ లను తమచేతులతో వారు పట్టుకొని ప్రాఁకుచుండిరి. కొన్ని సమయములయందు మృత్యుముఖంబునఁ బడుటకు సిద్ధముగ నుండిరి. ప్రమాదవశంబున నెవ్వరైన జాఱిన పక్షమందుఁ

బాతాళంబునకుఁ గొనిపోఁబడుట కెట్టి యనుమానము లేక యుండెను. మృత్యువు ప్రతిక్షణంబునను బ్రత్యక్ష మగుటకు సిద్ధముగ నుండి వారిని వెంబడించుచుండఁగా ముక్కాలుగంట సే పావిధంబుగ నాకొండ నెక్కిరి. అక్కడిగాలి సుగంధిమై, యానందప్రదమై, సారవంతమైయుండెను. ఇట్టియపాయకర మైన సాహసకార్యముచే నామంచుగడ్డను దాఁటి యావలికి పోఁగలిగిరి. ఇక్కడి యమునానదిని వారు విడిచి యింకొక కొండ నెక్కవలసివచ్చెను. దారి లేదు. కాలిబాటమైనఁ గనఁ బడకుండెను. దట్టమైన యొకయడవి యుండెను. ఆయడవిలో చెట్లయొక్క యాకులు తప్ప మఱేమియుఁ గానరాకుండెను. మనుష్యులకుఁజొచ్చుట కసాధ్యమైనయరణ్య మయ్యది. రామ తీర్థుని శరీర మక్కడక్కడ ముండ్లచే గీచుకొనిపోయెను. ఈ యరణ్యమం దొక్కగంటకాలము కష్టపడి దానిని వారు దాఁటఁగలిగిరి. చిన్నచిన్న చెట్లు గలిగిన బయలునకు వారు వచ్చిరి. ఇక్కడను మంచి సువాసనతోఁ గూడిన చల్లనిగాలి వీచుచుండెను. అందఱు నలసటఁజెందిరి. మంచుచే భూమి మీఁదఁ గాలు జాఱుచుండెను. అనారోగ్యస్థితియం దున్న రాముఁడు మిక్కిలి యారోగ్యవంతుఁడై తోడ వచ్చినవారి కన్న ముందుగ వెళ్లుచుండెను. ఎక్కువెక్కు వర్షములు కురియునటువంటి స్థలమునకు వారు వెళ్లిరి. అక్కడ మంచే వర్షమువలెఁ గురియుచుండును. అక్కడఁ జెట్లు చేమ లేమియు

లేవు. ఒక పెద్దబండమీఁద రామునికై యతని యెట్టునికంబ ళిని పఱచిరి. ఆముందురాత్రి పక్వముచేయఁబడిన బంగాళా దుంపలను రాముని కాహారమొసంగిరి. తోడివారును దానినే తినిరి. భుజించినపిమ్మట తిరిగి పర్వతము నెక్క మొదలిడిరి. పోఁగాఁ బోఁగా వారిలో నొక్కఁడింకనొక్కయడుగైనఁ బెట్టలేక క్రిందఁబడిపోయెను. వానినక్కడవిడిచి మిగిలినవారలు వెళ్లిరి. అతనివలెనే యక్కడక్కడ మఱి ముగ్గురు పడిపోయిరి. ఒక బ్రాహ్మణుఁడు మాత్రము రామునితోనుండెను. బాణములవలె నతివేగముగఁ బరుగిడుచున్న సుందరములైన మూఁడుసూప్పుల నక్కడ వారు గాంచిరి. ని రెక్కడ వెదకినను గానరాదు గాని బండలక్రింద జలజల ప్రవహించు సందడి మాత్రము వినవచ్చు చుండెను. రామునితో నుండిన బ్రాహ్మణునొద్ద నెట్టుకంబళి, దూరదర్శనయంత్రము, ఆకుపచ్చని కన్నద్దములు, చిన్న చేతి గొడ్డలియు నుండెను. అక్కడ గాలి మిక్కిలి పలుచనగా నుండెను. వారితలలమీఁదుగా రెండు గరుడపక్షు లెగురు చుండెను. నల్లనియూదారంగుగల ఘనీభవించినమంచుతో నిండి యేటవాలుగా నుండు ప్రదేశమును దాఁటవలసి యుండెను. తోడిబ్రాహ్మణుఁడు తన గొడ్డలిచే నామంచు కొండయందు మెట్లనమర్పఁబూనెను గాని యామంచు చిర కాలముగ ఘనీభవించియుండుటచేఁ గఠినమై యుండుట వలన గొడ్డలి పగిలిపోయెను. అప్పుడు మంచువర్షము కురి

సెను. అది వారికి దైవికముగా సుమేరువునకుఁ బోవుటకు మార్గమును గొంచెము సులభముచేసెను. చేతులలోఁ బొడు గైన కఱ్ఱల నుంచుకొని వాని నూఁతఁ జేసికొని పైకి వెళ్లఁగలి గిరి. మైళ్లకొలఁది విశాలమైన మైదానప్రదేశమం దక్కడ మిఱుమిట్లుగొల్పెడు తెల్లనిమంచు పఱచినట్లుండెను. రామతీ ర్థుని కధికానందము గలిగెను. రాముని యానందమును పట్టఁ బగ్గములు లేకపోయెను. అద్భుతమై యున్నతమై శ్రేష్ఠమై ప్ర కాశమైన క్షీరసముద్రమువలె నది కన్నుల కగపడు చుండెను. ఎఱ్ఱకంబళి భుజముమీఁద నుంచుకొని కాళ్లకు జోడు వేసి కొని యతివేగముగ నామంచుకొండమీఁద రాముఁడు పరు గెత్తసాగెను. అతనితో నెవ్వరుచుండలేదు. ఒంటరిగ నామంచు కొండ నెత్తముమీఁద మూఁడుమైళ్లు దూరము రామతీర్థుఁడు నడిచివెళ్లెను. కొన్ని చోట్లలో నతనికాలు మంచులో దిగఁబ డెను. కష్టపడి బైటికి తనకాలిని బెల్లగించుకొనెను. కట్టకడ పట నొకమంచుదిబ్బమీఁద రామతీర్థుఁడు తన యెఱ్ఱకంబళిని బఱచెను, దానిపైఁ గూర్చుండెను. ప్రపంచసంబంధమైన యలఁపు లల్లరులు లేక నిశ్శబ్దముగా నుండిన యాప్రదేశమందు రామతీర్థుఁడు శాంతిని నానందము ననుభవించెను. ప్రశాంత మై సుఖకరమైన యానిర్జనప్రదేశము సర్వసంగపరిత్యాగము చేసిన రామతీర్థునికి మహానందమును గలుగఁజేసెను. పలు చనిమంచు మబ్బులనుండి దారిచేసికొని వచ్చుచుండిన సూర్య

కిరణములకాంతి వెండివలెఁ దెల్లగనుండిన యామంచుప్రదేశ మంతేయు నొక్కక్షణంబులో ధగధగ మను బంగారుమయ ముగా నొనర్చెను. బంగారుకొండగ నది మాఱిపోయెను. దీనికి సుమేరు వని పెద్దలు పేరిడుట సార్థకముగ నుండెను.

సుందరమందయానల కపోలములందలి యెఱ్ఱని రాగ ము, సుమేరువుయొక్క సర్వాతిశయమైన మనోహరత్వమం దణుమాత్రమైయుండునా, యని శంకింపఁదగియున్నది. రామతీ ర్థునిభృత్య వేషమునుధరించి, యాయనమాటను శిరసావహింప సిద్ధముగా నుండిన ట్లాశోభాయమానమైన మంచు గన్పట్టెను. బ్రహ్మసాక్షాత్కారము నొందిన రామతీర్థునికిఁ దక్క మఱి యేరి కాస్థలములం దుండ సాధ్యమగును?

### వసిష్ఠాశ్రమము

రామతీర్థుఁడు వసిష్ఠాశ్రమమునందుఁ గొంతకాలము నివసించెను. ఆయాశ్రమమునకు, జమ్నోత్తరి, గంగోత్తరి, సుమేరు, కేదార, బదరీనాథ, మంచుకొండలు చేయి సాఁచి యందుకొనుటకు వీలగునను భ్రమ కలిగించునంత దగ్గఱగాఁ గనఁబడుచుండును. ఈయాశ్రమమును ధగద్ధగాయమాన మైన వజ్రసానువులు పరివేష్టించియుండును. అక్కడ నుండు విశాలమైన మైదానమందు ఊదా, ఎఱుపు, పసుపు, తెలుపు రంగులుగల పుష్పము లనేకము లుండును. ఇం దనేకములు సుగంధములు గలవు. ఈలతలను మొలకలను నక్కడినుండి

పెకలించి మనదేశమునకుఁ దెచ్చి నాటుకొనవచ్చును గాని యాపరిమళ ముండదు. ఐరోపాదేశపు పుష్పములు, ఆకులు, అని మనమనుకొను దొరలయిండ్ల ముందటి లతలు చెట్లు ద్రుమములు పొద లన్నియు హిమాలయంబులందుఁ గానవచ్చెడిని. ఆమైదానము దేవతలకు నుద్యానవన మని భయపడి జను లెవ్వరు నచటికి వెళ్లరు. అందువలననే యక్కడి యంద మానందమయముగనున్నది. ఈపుష్పభూమియందు రామతీర్థుఁ డతిజాగ్రత్తతో నడుచుచుండెను. మృదుమధురము లైన యా ప్రసూనసంచయమునకు నెట్టి హానియైనఁ గలుగునేమో యని మనసునందు రామతీర్థుఁడు భయము చెందుచుండెను. పావురములు, కోయిలలు, నానావిధము లైన పక్షులు, ప్రాతఃకాలమున రామునికి మేలుకొల్పులు పాడుచుండెను. కొన్ని దినము లుదయమునం దొకగొప్పసర్పము రామతీర్థుఁ డుండిన గుహయొక్క పైభాగము దగ్గఱకు వచ్చి యొకవిధమైనశబ్దము చేయుచుండెను. మిట్టమధ్యాహ్నసమయమున గరుడపక్షులు మేఘమండలము నంటుకొని యాకసమునందెగురుచు 'కృష్ణా'యని కూయుచుండెను. ఒకదినము రాత్రి యొకపెద్దపులి రామతీర్థునిదగ్గఱగా గంతులు వేయుచుఁ బోయెను. అక్కడ మంచిసర స్సొకటి యుండెను. ఆసరస్సుచుట్టును పెద్దవృక్షము లుండెను. అన్ని వృక్షముల వ్రేళ్లును ఆసరస్సులోనికి దిగియుండెను. ఆచెట్లన్ని

యు సరస్సు నీళ్లచే బ్రదుకు చుండినట్లు జీవప్రపంచ మంతయుఁ బరబ్రహ్మ మను సరస్సునందు సంబంధము కలిగి యున్నదనియు, సరస్సునీరు చెట్లయందంతయుఁ బాఱుచున్న ట్లులు తత్త్వము విశ్వంబంతయు వ్యాపించి యున్నదనియు, జగదుద్ధరణమునకు బ్రహ్మమే కారణ మనియు రామతీర్థుఁడు నిత్యుపదేశము చేసెను. ఆ శిఖరమందుఁగల గుహాలన్నియు వర్షముచేఁ దడపఁబడఁగ, రామతీర్థుఁ డెక్కడ నుండుటకు వీలులేక యాదేవతల యుద్యానవనమును విడువవలసి వచ్చెను.

జగదేవి తృణభూమి

మనోజ్ఞమై యున్నతమైనచదరపు తృణభూమిని రాముఁడు చేరెను. అచ్చటఁ దెలుపు పసుపు వర్ణములు గల మల్లె కుసుమములును గలియపండ్లు, జానపండ్లవంటి పండ్లతో నిండినపొద లనేకము లుండెను. రెండు సెలయేళ్లమధ్యఁ గడు దూర మొకపచ్చికబయ లుండెను. ఆబయలులో రామతీర్థుని కొఱకు కుటీరముండెను. ఆ కుటీరమునకు ముందు రమ్యమైన యడవిచెట్లతో నిండిన కొండచరియలు గనఁబడుచుండెను. ఆతృణభూమియందు నున్నని పలకలవంటి బండలనేకము లుండెను. ఆబండలే రామతీర్థునికిఁ గూర్చుండుటకుఁ బండుకొనుటకు నుపయోగపడుచుండెను. అచ్చట దట్టంపుఁదోఁపులు గలవు. ఎండ విశేషమైనపు డాతోఁటలలో తరుచ్ఛాయ లందు రామతీర్థుఁడు విహరించుచుండెను. అక్కడను పెద్ద

వర్షము కురిసెను. ఇంకను బ్రహ్మాండమైన వర్షము కురియు నుండెను. అచ్చటి గొల్లపిల్లవాండ్రు రామతీర్థుని భగవంతునివలెఁ జూచుచుండినందునను దమ గొఱ్ఱె లనేకపర్యాయము లతితీవ్రముగాఁ బ్రవహించుచుండిన కొండ సెలయేళ్ల నాయన ప్రవాహమందీఁది దాఁటించినందున, తమ కృతజ్ఞతఁ జూప నెంచి రామతీర్థునికి మూఁడుగంటలలో నొక పర్ణశాలను నిర్మించిరి. అనుకొనినట్టుగా నారాత్రి తీక్ష్ణమైన గాలివాన కొట్టెను. మూఁడుని మేఘముల కొకపరి కన్నులు మిఱుమిట్లు చెందునట్టుల మెఱుపులు కలుగుచుండెను. పెద్దపెట్టున మేఘములు గర్జించెను. ఆయుఱుములకు కొండశిఖరములు విఱిగి నెత్తిని బడునట్లుండెను. వర్ష మపరిమితముగాఁ గురియసాగెను. పర్ణశాల దానికిఁ దట్టుకొనలేక పోయెను. వర్షధారలు పర్ణశాలయందంతయునిండెను. రామతీర్థునిపుస్తకములను గాపాడఁ గష్టమయ్యెను. ఒకగొడుగుక్రింద నా పుస్తకములను బెట్టుకొని కూర్చుండి రామతీర్థుఁడు తల దాఁచుకొనెను. గుడ్డలన్నియు తడిముద్దలయ్యెను. భూమి గడ్డిచేఁ గప్పబడియుండుట వల్ల బురద కాలేదు. కాని పైనుండి కాఱుచుండినవర్షధారలచే నేలయంతయు నీటితో నిండియుండెను. రామతీర్థుఁ డారాత్రి చేఁపలవలెఁ దాఁబేళ్లవలె నీళ్ళలోనే నివసింపవలసివచ్చెను. ఆస్థితియు నతని కత్యధికంబైన యానందమును గలుగఁ జేసెను.

రామతీర్థుఁ డక్కడి కొండలలో దినమునకు నలువది మైళ్లు లెక్కను నడువఁ గలిగిన శక్తివంతుఁడుగ నుండెను. ప్రతి దినమును క్రొత్త క్రొత్త కొండల నెక్కుచుండెను. పుణ్యక్షేత్రంబుల దర్శించుచుండెను. మహాత్ములను సేవించుచుండెను. గృహమందును, భార్యయందును జన్మించిన ప్రేమను రామతీర్థుఁడు ప్రపంచమందలి తృణము, పుష్పములు, నదులు, నదములు, కొండలు, తిప్పలు, గుహలు మొదలగు నన్నిటియందును బ్రసరింపఁ జేసెను. ప్రతిదినంబును రాత్రింబవలును నొకటో రెండో వర్షపు జల్లులు పడుచుండెను. రాముఁడు పర్వతారోహణముఁ జేయునపుడును నా జల్లులచేఁ దడపఁబడుచుండెను. అక్కడ దగ్గఱను గుహలు లేనందున మేఘములే యతనికి గొడుగు లయ్యెను. ఆజల్లులన్నియు రాముని వయ్యెను. ఆ పుణ్యభూమికి జగదేవి శాద్వల మని పేరు. అటఁ జుట్టుప్రక్కల నుండు పల్లెవారలు రామతీర్థుని దేవుఁ డని నమ్ముచుండిరి. మానవుల కతీతములైన కార్యములు చేయుచుండుటచే నాయనయందు వారి కపరిమితమైన గౌరవ ముండెను.

కొంతకాలమునకుఁ గాడియా కొండమీఁదికి వచ్చి యక్కడ రాముఁడు నివసించుచున్నట్లు తెలియవచ్చుచున్నది. ఈ కొండ డేరాడూన్ రైలు స్టేషనుకు రెండు మైళ్ల దూరములో నుండును. ఆ స్టేషనువద్ద రైలు దిగి, టిహ్రి మార

రామతీర్థుఁ డక్కడి కొండలలో దినమునకు నలువది మైళ్లు లెక్కను నడువఁ గలిగిన శక్తివంతుఁడుగ నుండెను. ప్రతి దినమును క్రొత్త క్రొత్త కొండల నెక్కుచుండెను. పుణ్యక్షేత్రంబుల దర్శించుచుండెను. మహాత్ములను సేవించుచుండెను. గృహమందును, భార్యయందును జన్మించిన ప్రేమను రామతీర్థుఁడు ప్రపంచమందలి తృణము, పుష్పములు, నదులు, వనములు, కొండలు, తిప్పలు, గుహలు మొదలగు నన్నిటియందును బ్రసరింపఁ జేసెను. ప్రతిదినంబును రాత్రింబవలును నొకటో రెండో వర్షపు జల్లులు పడుచుండెను. రాముఁడు పర్వతారోహణముఁ జేయునపుడును నా జల్లులచేఁ దడుపఁబడుచుండెను. అక్కడ దగ్గఱను గుహలు లేనందున మేఘములే యతనికి గొడుగు లయ్యెను. ఆజల్లులన్నియు రాముని వయ్యెను. ఆ పుణ్యభూమిని జగదేవి శాద్వల మని పేరు. అటుఁ జుట్టుప్రక్కల నుండు పల్లెవారలు రామతీర్థుని దేవుఁ డని నమ్ముచుండిరి. మానవుల కతీతములైన కార్యములు చేయుచుండుటచే నాయనయందు వారి కపరిమితమైన గౌరవ ముండెను.

కొంతకాలమునకుఁ గాడేయా కొండమీఁదికి వచ్చి యక్కడ రాముఁడు నివసించుచున్నట్లు తెలియవచ్చుచున్నది. ఈ కొండ డేరాడూన్ రైలు స్టేషనుకు రెండు మైళ్ల దూరములో నుండును. ఆ స్టేషనువద్ద రైలు దిగి, టిహ్రి మార్గ

మ్యాక్స్‌మిల్లర్ దొరగారి యింటిలోను, జర్మనీదేశములోను, నితరస్థలములందును నిండియాదేశపు బండితులను. సాధువులను బలుమాఱు చూచుటకు నాకవకాశము కలిగెను. అయినను రామతీర్థస్వామి యట్టివాని నెక్కడనైనను నేను జూడలేదు. వేదాంతశాస్త్రమే స్వామి రామతీర్థుని శరీరము" అని చెప్పెను. టోకియో పట్టణమునఁ బ్రశస్తిం గాంచిన పండితుఁడైన కింజాహీరైగారు అమెరికా దేశమందలి చికాగోలో జరిగిన సర్వమతసంఘమునకు వాక్పటుత్వము కలిగిన బౌద్ధమతప్రతినిధిగా నుండెను. ఈపండితుఁడు రామతీర్థునితో సంభాషించుచుండఁగ జపానియు, చైనాభాషలందుండు గ్రంథరాజంబులందు వ్రాయఁబడి యుండు హిందూదేశచరిత్రలోని బౌద్ధమతకాలవర్ణనలు, జ్ఞప్తికివచ్చునటులు రామతీర్థుడు బౌద్ధమతవిచారము చేసి తన శేముషీప్రభావమును గనఁబఱచెను. రామతీర్థుఁడు జపాను దేశము విడిచినపిమ్మటను హీరైగారతనిని మఱవకుండిరి. ఆయనప్రజ్ఞావిశేషమునకు హీరైగారచ్చెరు వొందుచుండిరి.

జపాను దేశమందు "జయముయొక్క రహస్యము" అను శీర్షికక్రిందఁ బారిశ్రామికౌన్నత్యము నొందుచున్న జపానీయులకు మిక్కిలి యవసరమైన వేదాంతవిషయములను బ్రాపంచికానుభవమం దభ్యసింపఁదగి యుండునట్లు బోధ గావించెను.

## అమెరికాయాత్ర

జపాను దేశమునుండి యెప్పుడు బయలుదేఱినను, రామతీర్థుఁ డమెరికాలోని సాన్‌ఫ్రాన్‌ శిస్కో నగరమందు 1902 - వ సంవత్సరము డిసంబరు నెలలో నుండెను. ఈ దేశమందును నతఁ డేకాంతవాసమునందే చాల మట్టునకుఁ దనకాలమును గడపెను. అడవినుండి తనకుఁ గావలయు కట్టెలను నెత్తిమీఁద మోసికొని వచ్చుచుండెను. రామతీర్థునిఁ బొగడుచు నాయన జీవితము, పని విషయమై వ్రాయఁ బడిన పత్త్రికల నాయనకుఁ దత్పత్త్రికాధిపతులు పంపుచుండిరి. రామతీర్థుఁ డీపొగడ్తలయందు నిష్టము లేని వాఁడై యాకాగితములనుగట్టకట్టి సాక్రమెంటో యనుపేరుగల యొకనదిలోఁబాఱవైచుచుండెను. ఈసంగతి కాలిఫోర్నియాలో నుండు జనులకందఱికి నద్భుతము గల్పించెను. నలువదిమైళ్ల పరుగుపందెములో రామతీర్థుఁడు జయించి యమెరికాదేశస్థులకు విస్మయము కలుగఁజేసెను. రామతీర్థుని మఱవకుండు నట్లు లమెరికాదేశమం దాయన వేదాంతవిషయమందుఁ బరిశ్రమించెను. ఆదేశ మెల్ల రామతీర్థుఁడు దిరిగెను. కొలంబియాల్లో నెన్ని దినంబులు తానుగడపెనో యన్ని యుపన్యాసములాదేశమునందు రామతీర్థుఁ డిచ్చెను. క్రైస్తవుల గుడులలోను, రామతీర్థుఁడు నూతనాంశముల ననేకములఁ జెప్పెను. శాంతముగాను నిష్కపటముగాను నిర్దోషముగాను బవిత్ర

ముగాను ప్రసిద్ధముగాను నత్యాదరముగాను సరళముగాను నిరహంకారముగాను రామతీర్థు డుండుటచే సత్యము తెలిసి కొనుటకై వచ్చెడు పరితప్తహృదయులందఱును నింతం తన రాని లాభమును బొందుచుండిరి. అతనితో సంభాషించి తృప్తిం జెందక వెళ్లినవాఁ డొక్కఁడు లేఁడు. రామతీర్థుఁ డమెరికా దేశస్థులకు ప్రశ్నోత్తరరూపముగా వారి సందే హంబుల నన్నింటిని నివారణ చేయుచుండెను. రామతీర్థుఁడు సర్వకాల సర్వావస్థలయందును ప్రసన్నచిత్తుఁడై, సంభా షణమందో రచనయందో పుస్తకములం జదువుటయందో, లేక ఓంకారమననమందో కాలము గడపుచుండెను. ప్రతిమనిషి యందును బ్రహ్మతత్త్వమునే రామతీర్థుఁడు గాంచుచుండుటచే, నందఱి నాయన "తత్త్వస్వరూపులారా" అనిపిలుచుచుండెను. తానే యన్ని రూపములుగ నున్నటులును జెప్పుచుండెను. చూచుట కింపైన వనములు, నృత్యగానములు సల్పుచుండెడి ప్రవాహములు, మనోహరమైన చల్లని మలయమారుతము, వెచ్చనిసూర్యరశ్మి, యుపశాంతికరములైన వెన్నెలరాత్రులు, వజ్రములవలెఁ బ్రకాశించునక్షత్రసమితి, ప్రకృతిచేఁ బ్రతిమనుజు నికిని శాంతమును బ్రబోధించుటకై యేర్పఱుపఁబడినవి. వీని నన్నిటిని యథేష్టముగా ననుభవించి యా పరమానందమును బొందనగును. ఏవోకొన్ని స్థితిగతులందుమాత్రము సౌఖ్యము కలుగు నని నమ్మువార లట్టి స్థితిగతులు గల దినంబు వెను

కను వెళ్లుచుండఁగా ననుభవింపకయే సమాప్తిఁ జెందవలసి యుండును.

ఒక పర్వతప్రాంతమందొక గుడారంబున రామతీర్థ స్వామి నివసించుచుండెను. రాంచ్ అని పేరు గల గృహంబున నతఁడు భుజించుచుండెను. ఆప్రదేశ మతిరమ్యమై, నిమ్నోన్నతమై, వన్యవృక్షములతో నలంకరింపఁబడియుండెను. ఇరుప్రక్కల నెత్తైనకొండ లుండెను. కన్నుల కింపుగా నాపర్వతములమీఁద మహావృక్షములు లతలు ద్రుమములు ననేకము లుండెను. ఆకొండలసందున వక్రగమనమున నొక సెలయేఱో నది ప్రవహించుచుండెను. ఈస్థలమునందే రామతీర్థుఁ డమెరికాదేశమందలి యుద్గ్రంథంబుల నన్నింటిని జదివెను. రామతీర్థుఁ డానదీతీరమందే మహత్తరమైన కవనమును జెప్పఁగలిగెను. కవుల కందఱికిని గవి యైన రామతీర్థుని కవిత్వ మాంగ్లేయభాషయందుఁ జెప్పఁబడియె. ఆ కవిత్వమందు నుదాహరింపఁబడిన యద్భుతమైన చైతన్యము భూమియందంతటను నివసించిన యల్పకాలములోని మహత్కార్యమై తనరారుచున్నది. ఆ యేటిలోఁ బెద్దరాతిగుండొకటి యుండెను. అక్కడఁ బ్రవాహ మతివేగవంతముగా నుండెను. ఆ గండశైలముమీఁద దినములకొలఁది రామతీర్థుఁడు వసించుచుండెను. భోజనమునకు మాత్రము దానిని విడిచివచ్చుచుండెను. షట్టగుండములనుండి యనేకులు

రాముని దర్శింప వచ్చుచుండిరి. వారంద అతనిచే సన్మానింపఁబడుచుండిరి. అతని ఘనమైన భావము లందఱ మనములందు నాటుకొనుచుండెను. అతని సన్నిధికి వచ్చిన ప్రతివాని హృదయక్షేత్రమందును వేదాంతబీజము నాటఁబడుచుండెను.

1903-వ సంవత్సరము జూలై మొదలు అక్టోబరు ఆఖరువఱకును, రామతీర్థుఁడు షష్టగుండముల దగ్గఱ నివసించుచుండినట్లు తెలియవచ్చుచున్నది. జూన్ నెల 11 తేదిని రామతీర్థుఁడు వ్రాసిన యొకయుత్తరమువలన నతఁడు క్యాసిల్ గుండములదగ్గఱ నాసమయమున నున్నటులు గానఁనగును. ఆయుత్తరములో మే నెలలో జరిగిన వృత్తాంతమును వివరించుటచే మే నెలలోఁగూడ నక్కడనే యుండినటు లూహింపఁదగియున్నది. మే నెల తే 19 దిని సీటిల్ పట్టణము నుండి రామతీర్థుని స్నేహితుఁ డొకండు అతని కొక యుయ్యెలను బంపఁగా దానిని బచ్చని మద్దిగడి చెట్టునకును నెట్టని దేవదారు వృక్షమునకును దగిలించి దానిలో రామతీర్థుఁడుయ్యేల లూఁగెను. మధురమోహాన మైన సువాసనలచేఁ బూరితమైన మలయమారుతము ముందునకును వెనుకకును నాయుయ్యేల నూఁచుచుండఁగ, ప్రక్కనుండి ఓంకారధ్వని నమోఘముగఁ జేయుచుండిన నదీప్రవాహము రామతీర్థుని యానందము నపారముగాఁ జేసెను. రాముఁడు పక పక నవ్వ

సాగెను. న వ్వతిశయమై యుయ్యేలను విడిచి గంతులు వైచి నాట్యము చేయుచుండఁగా, ఎదురుగా నొకతరుశాఖమీఁదఁ గూరుచుండియుండిన గోరువంకపక్షి తటాలున నుయ్యేలలో వ్రాలి యూఁగఁ బ్రారంభించెను. రామునివలెనే చిన్నపక్షు లన్నియు నానందపూరితములు. అన్నియు రామునిరూపములే గాన నాస్వామి కెట్టి వికారము కలుగకుండెను. ఆమఱు నాఁడు అమెరికాదేశపుఁ బ్రభువు రాముని దర్శింప వచ్చెను. ఆగుండముల ప్రాంతముల కధికారిణి యగు నొక దొరసాని ఘనముగా నాప్రభువును సన్మానించెను. అనేకులు ప్రభువు తో వచ్చిరి. ఆయుత్సవము గొప్పదిగా నుండెను. ఆప్రభువు రామతీర్థునిఁ జేరఁగా "ఇండియా దేశస్థులకొఱ కొక విజ్ఞప్తి" అను పేరుగల చిన్నపొత్తమును రామతీర్థుఁడు దానిదినమె రచించి యచ్చొత్తించియున్న దానిని బ్రభువున కిచ్చెను. ఆ మహారాజాపొత్తమును సంతోషముతోఁ బ్రేమతో వందన పూర్వకముగా గ్రహించెను. ఆపుస్తకమును దనకుడిచేతిలో నుంచుకొనినవాఁడై, చూడ వచ్చిన జనుల వందనములకుఁ బ్రతివందనములు చేయుచు ననేకపర్యాయము లాపుస్తక మును దనముఖముదగ్గఱ కెత్తుకొనుచుండెను. బండిలోఁ గూరుచుండిన పిమ్మట నాప్రభు వాగ్రంథమును శ్రద్ధగాఁ జదువుకొనెను. కడపట మఱియొకపరి రామతీర్థునకు భక్తి పూర్వకముగా వందనముఁ జేసి యాప్రభువు వెళ్లెను. రామ

తీర్థుఁడు తనయుద్యోగములోఁ గూరుచుండు మని యాప్రభు వును వేఁడుకొనలేదు. దానికిఁ గారణము, "అమెరికాదేశ మున కంతయుఁ బ్రభువుగా నుండినను నతనికి రాముని పక్షుల కుండిన స్వాతంత్ర్యములో సహస్రాంశ మైన లే" దని రాముఁ డే వచించెను. రామతీర్థుఁ డమెరికాదేశంబున నందఱసన్మా నమునకుఁ బ్రేమకు నుచితమైన పాత్రుఁడుగ నుండెను. ఇచ్చ టినుండి షష్టగుండములకు రాముఁడు వెళ్లెను.

ఇక్కడను గొండ సెలయేటియొద్దున రాముఁ డుండెను. షష్టపర్వతము భూమినుండి 14,444 యడుగు లెత్తు గలిగిన శిఖరమును గలిగియుండెను. రామతీర్థుఁ డాశిఖరము నెక్కి దిగుచుండెను. నానాదిక్కులనుండి రామతీర్థున కాహ్వాన ములు వచ్చుచుండెను. కవులు తమయుత్తరములు పద్యరూపముగ రామునికి వ్రాయుచుండిరి. అతఁడుకూడ నదేవిధముగఁ బ్రత్యుత్తర మిచ్చుచుండెను. అతనికవిత్వమాధుర్యము, భావ గాంభీర్య మాదేశపుఁగవు లనుభవించుచుండిరి. రామతీర్థుని కిద్దరుస్త్రీలు శిష్యులుగ నుండిరి. వారిపే ర్లేమైనను, రామ తీర్థుఁడు చంపా యనియు, కమలా యనియు వారినిఁ బిలుచు చుండెను. 1903-వ సంవత్సరము జూలై నెల తే 22 దిన రామ తీర్థుఁడు చంపకు వ్రాసిన యుత్తరమువలనఁ గమల రాముని దగ్గఱ నుండినటులును, చంప యడిగిన ప్రశ్నల కన్నిటికిని యుత్తరములు రాముఁడు చెప్పుచుండఁగా, కమల వ్రాయు

చున్నట్లును రాముఁడు వ్రాసిన కవిత్వమును గొంత చంపకుఁ బంపినటులును దెలియవచ్చుచున్నది.

రామతీర్థున కింకొక శిష్యురా లుండెను. ఆమెకు సూర్యానంద యని రామతీర్థుఁడు పేరిడెను. ఆమె ఇండియా దేశమునకు రాఁదలంచియుండెను. అట్టిసమయమున నామెకు రామతీర్థుఁడు వష్టగుండములనుండి యుత్తరములు వ్రాసెను. అందులో 1903-వ సంవత్సరము అక్టోబరు నె 21 దిని వ్రాసిన యుత్తరములో సూర్యానందను చైనాదేశమందలి హాంగ్ కాంగ రేవుపట్టణమున దిగినపు డక్కడ గడియారపు గోపురముదగ్గఱ నుండిన 'ప్రొవిన్షియల్ అస్సెమల్' అనువానియింటికి వెళ్లు మనియు, నాయూరిలో నుండు హిందూవర్తకులకు రామునిసంగతిఁ దెలిపి వారి కానందమును గలిగింపుమనియు, రామతీర్థుఁడు వ్రాసియుండెను. ఇందువలన రామతీర్థుఁడు జపాన్ దేశమునకు వెళ్లునపుడు దారిలో హాంగ్ కాంగ్ పట్టణమున నోడ దిగి యక్కడిహిందూవర్తకులతోఁ బరిచయము గలుగఁజేసికొనిన ట్లున్నందగియున్నది.

రామతీర్థుఁడు పోర్టులాండు, ఓరిగాన్‌లో నొక మాసమును, డెన్వరులో నొక నెలయు, చికాగోలో రెండువారములును మినియాపోలీసులో రెండు వారములు నుండి వేదాంతసంఘములను స్థాపించెను. 1904-వ సం|| ఫిబ్రవరిలో చికాగోలోను, ఏప్రిలులో మినియాపోలీసులో నున్నటు

లతఁడు వ్రాసిన కొన్ని యుత్తరములవలనఁ దెలియవచ్చు చున్నది. వివిధ సర్వకళాశాలలందు బీదలయిన హిందూ విద్యార్థుల కుచిత విద్యార్థివేతనములను రామతీర్థుఁడు సంపా దించెను. అక్కడినుండి రామతీర్థుఁడు బఫాలోనగరమునకును, న్యూయార్కు, ఫిలడెల్ఫియా, వాషింగ్టన్ నగరములకును వెళ్లెను. సెంట్‌లూయి నగరమందు 1904-వ సంవత్సరము జూన్ 29, 30, 31 వ తేదీలలో జరిగిన విశ్వైకమత్యసభ (World's Unity Leagues) లను రామతీర్థుఁ డలంకరించెను. జూలై నెలలో జెనివా సరస్సునొద్ద నుండెను. అక్కడ నుండి ఇంగ్లాండుదేశ రాజధాని యగు లండన్ నగరమునకు రామ తీర్థుఁడు వెళ్లఁదలంచెను గాని యతని యత్నము కొనసాగిన ట్లగపడుట లేదు. 1904 సంవత్సరము జూలై నెల 8 తేదిని జెనీవా సరస్సునుండి రామతీర్థుఁడు వ్రాసిన యుత్తరములో (World's Unity League) విశ్వైకమత్యసభయొక్క ప్రథమ దిన సభకుఁ దా నధ్యక్షత వహించె ననియు నుపన్యాసము లిచ్చె ననియు, దివ్యజ్ఞానసమాజమునకుఁ (Theosophical Society) ప్రతినిధిగాఁ గొన్ని యుపన్యాసములు సెంట్‌లూ యిలోఁ దా నిచ్చినట్లును నక్కడినుండి మఱికొన్ని స్థలము లకు వెళ్లి సెప్టెంబరు నెలలోనో యంతకుముందో అమెరి కాను వదలఁదలచినట్లును వ్రాయఁబడి యున్నది. 1904-వ సంవత్సరము అక్టోబరు నెల 1-వ తేదిని ఫ్లారిడాలో నుండెను.

అచ్చటనుండ న్యూయార్కునకు 3-వ తేదిని బయలుదేఱి వెళ్లి 8-వ తేదిని "ప్రిన్సెస్ ఐరీని" యను పేరుగల యోడ నెక్కి జిబ్రాల్టరుకు యాత్ర చేసెను.

రామతీర్థుఁ డమెరికాదేశమం దిచ్చిన యన్ని యుపన్యాసముల సార మొక్కటె భావమును సూచించుచున్నది. అహంకారమును వదలి యాత్మయే పరమాత్మగా సాక్షాత్కారముఁ జేసికొనుటయే యా భావము. ఇదియే రామతీర్థుని యుపన్యాసము లన్నిటియందును వ్యాపించియున్నది. అహంకారమే సర్వబంధములకు మూలము. దానిని వదలికొనిన యాత్మ బ్రహ్మస్వరూపమును జెందుచుండును. దీనికై యనేకమగు నభ్యాసములను రామతీర్థుఁడు బోధించెను. అట్టి యభ్యాసములవలననే యతఁడు స్వస్వరూపమును గనుఁగొనఁ గలిగెను స్వార్థపరిత్యాగమే బ్రహ్మసాక్షాత్కారమునకు మూలము. త్రాగుచుండిన శేసెంలో దిగఁబడినకాళ్లు నిఁగ యేవిధంబుగ నెమ్మదిగ దృఢముగఁ బెకలించుకొని శుభ్రపఱచుకొనునో, యదేవిధముగ మనమును నామరూపములందలి యభిమానమును గ్రమక్రమముగా వదలుచు, నొకటి వెంబడి యొకటి, మనసంబంధములను బంధములను ద్రెంపుచు వేదాంతము ననుష్ఠానమునకుఁ దీసికొని రావలయును.

ఈ జి ప్టు

రామతీర్థుఁడు జిబ్రాల్టరునుండి ఈజిప్టునకు వచ్చెను. ఈజిప్టుదేశములో మహమ్మదీయు లందఱును రామతీర్థునిని

విశేషముగ సన్మానించిరి. మహమ్మదీయ మసీదులో పరిషి యర్ భాషలో మహమ్మదీయులకు రాముఁడు గొప్ప యుప న్యాసము నిచ్చెను. మహమ్మదీయు లందఱు నధికోల్లాసముం జెందిరి. అతని ప్రజ్ఞావిశేషమునకు వారందఱు వెఱఁగుపడిరి. అతనిని మహమ్మదపరావతారమని యెంచిరి. ఈ జప్పునుండి ఇండియాకై రామతీర్థుఁ డోడ నెక్కెను. ఈజిప్టు పత్త్రిక లతనిని విశేషముగ ప్రశంసించెను.

ఇండియాభిముఖము

బొంబాయి నగరమందుఁ జేరి మొదుదినము లందుండి రామతీర్థుఁ డుపన్యసించెను. ఎ. యం. పరీక్షయందుఁ గృతా ర్థుఁడైన యొక చిన్నవాఁడు రామతీర్థుని సేవకై తన జీవిత మంతయు నర్పణము చేసెను. 1905-వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో రామతీర్థుఁడు బ్రహ్మదేవుఁడు యజ్ఞములు సల్పిన పుణ్యభూమియగు పుష్కర్ లోనుండెను. ఈపుష్కర్ అజ్మీరు జిల్లాలో నున్నది. ఈతరుణమందు రామతీర్థుఁడు తన శిష్యుఁడగు నారాయణస్వామిని వేదాంతబోధ సేయుటకై పేరుప్రసిద్ధిలేని పల్లెలకుఁ బంపెను. బొంబాయిని వదలిన తోడనే మధురానగరమునకు రాముఁడు వెళ్లెను. అక్కడ మతము విషయమై యుపన్యసించెను. అక్కడి పెద్దవారలంద ఱొకసంఘము నేర్పఱుపుమని రామతీర్థుని బ్రార్థించిరి. అందు లకు "అన్ని మతములునావే, అన్ని సంఘములునావే, ఉన్నసం

ఘములుచాలును, ఇంకను సంఘము లెందుకు? ఎవరికి వారు వేదాంతము ప్రతిదినము ననుష్ఠించినఁ జాలు"నని రాముఁడు ప్రత్యుత్తరమిచ్చెను. పుష్కరమునుండి జైపూరుకు మార్చినెలలో రాముఁడు వెళ్లెను. త్రోవలో అజ్మీరులో నిలిచి రెండుపన్యాసము లిచ్చెను. జైపూరులోను రామతీర్థుఁ డుపన్యసించెను. జనులు గుంపులుగుంపులుగా రామతీర్థుని సేవించుటకు వచ్చుచుండిరి. రామతీర్థుఁడు హరిద్వారమునకు బయలుదేరెను. త్రోవలో ననేక స్థలములందు రామతీర్థుని, జను లాతని యందలి ప్రేమవలన నిలిపిరి. ఆల్వారు, మొరాదాబాదు, ముజ్ఞఫర్ పట్టణములందు రాముఁ డుపన్యసించెను. వేదాంతబీజములను వెదఁజల్లుచు రామతీర్థుఁడు హరిద్వారమునకు వెళ్లెను.

## హరిద్వార వాసము

హరిద్వారమందు జనులు రామతీర్థుని నక్కడనే యుండుమని యనేకవిధములఁ బ్రార్థించిరి. రామతీర్థుఁడు వారి ప్రార్థన కియ్యకొని యక్కడి సాధుపురుషులకు వేదాంత ముపదేశముసేసెను. గంగానది కావలిగట్టున నుండిన చండిదేవాలయమునకు రామతీర్థుఁడు వెళ్లెను. అందఱును చండివిగ్రహముఁ జూచెదరు. రామతీర్థుఁడు నిజమైన చండదేవినే చూచెను. అక్కడ గంగానది, కొండ ప్రదేశము, వనములు, అతిరమణీయములుగా నుండెను.

రామతీర్థుఁడు హరిద్వారమందు సామాన్యజనమున కుపయోగపడునట్లు దేశభాషలోఁ గొన్ని గ్రంథములను రచియించెను.

రామతీర్థుఁడు హిమాలయపర్వతములఁ జేరి 1905-వ సంవత్సరము జూన్ నెల మొదలు మూఁడుమాసములు ప్రపంచమందలి యన్ని పర్వతశిఖరములకన్న నెత్తైయిన ఎవరెస్టు శిఖరమున కెదురుగానున్న యొక పర్వతశిఖరమందు వసించుచుండెను. ఈకొండ నెత్తము 8000 ల యడుగు లెత్తుగా నుండెను. వర్షాకాల మగుటచే రామతీర్థుఁడు కొండదిగివచ్చెను. ఈకొండనెత్తముమీఁద నయిదుపుస్తకముల నాతఁడు రచించెను; 20 పుస్తకములను జదివెను. రాముఁ డానందముగ్నుఁడై యుండెను. 1905-వ సంవత్సరము అక్టోబరు నెలలో రామతీర్థుఁడు ముజఫర్‌నగర్ పట్టణమునకు వెళ్లెను. వర్షాకాలము రామతీర్థుఁడు పుష్కర్‌లో గడపెను.

### పుష్కరవాసము

అద్దమువలెఁ బ్రతిబింబించు శుభ్రమైనయుదకముగలిగి మిక్కిలి లోఁతైన యొకసరస్సునొడ్డున రామతీర్థుఁడు నివసించుచుండెను. ఆసరస్సున కొకప్రక్కఁ బొడుగైన కొలఁది పాటి కొండ యొకటి యుండెను. అక్కడిచెట్లు గుబురై యుండుటంజేసి యాకొండ యాకుపచ్చని శాలువ కప్పుకొనినట్లుండెను. అక్కడ మామిడితోఁపులుండెను. రాముఁడు నివ

సించుచుండిన గృహంబున రెండు శృంగారోద్యానవనము లుండెను. నెమళ్లు తమకంచుకంఠములతోఁ బలుమాఱు అఱచుచుండెను. ఆసరస్సునందు బాతు లీఁదుచు నాటలాడుచుండెను. రామునితో నతని శిష్యుఁడగు నారాయణుఁడు మాత్ర ముండెను. ఈశిష్యుఁడు రాముఁడు చెప్పినదంతయు వ్రాయుచుండెను, రాముని వ్రాఁతల నన్నింటిని దిరిగి చక్కఁగా వ్రాయుచుండెను. ఈ సరస్సును భూమియొక్క కన్నుగాఁ గొందఱు వర్ణించుచుండిరి, చెట్లతోనిండిన తిప్పలు, గుట్టలు సరస్సుమీఁదికి వ్రాలియుండుటంబట్టి వానిని గనుబొమలుగాను వర్ణించుచుండిరి. రాముఁ డిసరస్సు నధికముగాఁ గొనియాడుచుండెను. వర్షాకాలము గడచినంతనే రామతీర్థుఁడు హిమాలయపర్వతముల కేగెను.

## వసిష్ఠాశ్రమము

1906-వ సంవత్సరము మార్చినెల తే 27 ది నతఁడు వసిష్ఠాశ్రమంబున నుండినపుడు రామతీర్థుఁడు రాయి సాహెబ్ బైజునాథ్ గారికి వ్రాసిన యుత్తరమువలనఁ దెలియవచ్చుచున్నది. అక్కడ నొకగుహ యుండెను. ఆ గుహలో రామతీర్థుఁ డుండెను. ఆగుహక్రిందుగా వసిష్ఠగంగ ప్రవహించుచుండును. అక్కడ 5, 6 ఆకాశగంగలు కలవు. శివుఁడు స్వహస్తములతో నిర్మించిన సరస్సులు రమారమి 20 కలవు. అక్కడివృక్షములు సర్వదా పచ్చగా నుండును.

వానిపై నాలుగుంగులమెత్తున మంచు నిండియున్నను ఒక్క యాత్రికైన వాడకుండును. ఇదియంతయు వనమాలియొక్క యనుగ్రహమే కదా? రామతీర్థుని కక్కడి కావుపాలు వచ్చుచుండెను. ఎవరో యొకమనుష్యుఁడు ప్రతిదిన మక్కడికి వెళ్లి వంటచేసి రామునికిఁ బెట్టి ప్రక్కను మూఁడుమైళ్లలో దగ్గరగా నుండు పల్లెలో రాత్రులు నిద్రించుచుండెను. అరమైలు పైకి వెళ్లిన కొండనెత్తమునకు వెళ్లనగును. అక్కడికిఁ బవిత్రములైన కేదార, బదరీ, సుమేరు, గంగోత్తరి, యమునోత్తరి, కైలాసపర్వతశిఖరములు గనఁబడుచుండును. యోగవాసిష్ఠమును రచించిన వసిష్ఠుని యాశ్రమము కేదారఖండమందు వర్ణింపఁబడియున్నది. ఆవర్ణన కనుగుణ్యమైన స్థలము రామతీర్థుఁడు వసించుచుండిన స్థానమే యయ్యెను. ఈయాశ్రమంబున 1906 సంవత్సరము జూన్ నెలాఖరు వఱకు రాముఁడుండెను.

### సహస్రతరుతాళ

జూలై నెలలో "సహస్రతరుతాళ" యను పేరుగల పర్వతశిఖరమునకు రాముఁడు వెళ్లెను. అక్కడఁ గైలాస పర్వతమందలి యాకాశగంగలును, మెఱుపుఁ దీఁగెలవలెఁ బరుగిడుచున్న కస్తూరీమృగములును, గరుడపక్షులును, బ్రహ్మకమలములును, మాసో లేసర గుగ్గల వాసనద్రవ్యములను

ద్రవ్యముండెను కూలీలును గానవచ్చుచుండిరి. అక్కడఁ జుట్టుప్రక్కల నెక్కడనైన నొక్కపల్లెగాని, కుటీరముగాని కానరాదయ్యెను.

మరణదీపము

రామతీర్థుఁను మరణమునకుఁ బూర్వము కొన్నిమాసములు టెహ్రీసంస్థానమందలి గార్వాల్ పట్టణముదగ్గఱ నొకకొండమీఁద నివసించుచుండినటులు దోఁచుచున్నది. టెహ్రీమహారాజు రామతీర్థుని సేవ చేయుచుండినటు లగుపడగియున్నది. 1906-వ సంవత్సరము అక్టోబరు నెలలో గంగలో స్నానముచేయుచు రామతీర్థుఁడు నీటిలో మునిఁగిపోయెను. మరణదినమున రామతీర్థుఁడు కడపట వ్రాసినవిషయము, మృతినిగుఱించినదై యుండెను. "ఓ మృత్యువా! నీ కిష్టమైన నీశరీరమును దీసికొనిపో. ఇంక ననేకశరీరములు నాకు నివసించుటకుఁ గలవు. చంద్రునియొక్క వెండిదారములను సూర్యునియొక్కబంగారుకిరణములను ధరించి నేను సౌఖ్యముగా జీవింపఁగలను కొండకాలువలు ప్రవాహములు- వానిరూపమును స్వేచ్ఛగాఁ బాడుచు నేను సంచారముఁ జేయఁగలను. సముద్రతరంగములందు సౌఖ్యముగా నేను నృత్యము సేయుచుందును. మందమారుతముయొక్క శృంగారమైన నడక నేనే; మత్తుగా నుండు గాలిని నేనే. ఈ నామరూపములు పరిణా

మముయొక్క చపలమైన యాకారములు. ఉన్నతస్థలముల నుండి క్రిందికి వచ్చితిని, తలుపులు కొట్టితిని, నిద్రపోవువారిని లేపితిని, ఒకరి నోదార్చితిని, ఇంకొకరి కన్నీళ్లు తుడిచితిని, కొందఱిని గమ్మ్రతిని, ఇతరుల ముసుకు తీసి పాఱవైచితిని, దీనిని దాఁకెదను, దానిని స్పృశించెదను, టోపీ తీసివేయుదును, నేను బయలుదేఱితిని, నాఁతో దేనిని నుంచుకొనను. నన్నెవ్వరును గనుఁగొనలేరు." ఆదినమున మరణము తటస్థించు నని తెలిసియో, తెలియకయో, ఇటులు రామతీర్థుఁడు వ్రాసెను. వ్రాసినవిధముగా బయలుదేఱి పోయినాఁడు. రామతీర్థునికి నాఁటికి ముప్పదిమూఁడు వర్షములే వయస్సు. వేదముల స్వారస్యవిషయమై, మానసికతత్త్వవిషయమై, రెండుగ్రంథములను రచింపఁదలంచెను గాని స్వర్గమందు వేదాంత ముపదేశించుటకై దేవతలు రామతీర్థునిఁ బిలుచుకొని పోయిన ట్లూహింపఁదగియున్నది. గంగాతీరమందు హృషీకేశమున రామతీర్థుని జ్ఞాపకార్థగ నాశ్రమ మొకదాని నాతని శిష్యులు కొందఱు నిర్మించిరి. ఆయాశ్రమమందుఁ బుస్తకభాండాగారము స్థాపింపఁబడెను. రామతీర్థుని మరణంబువలన నిండియాదేశమునకు మిక్కిలి నష్టము సంభవించెను. మహాత్ము లందఱును సహజముగఁ గొలఁదికాలమే జీవించియుందురు. ఈమహాత్ముని జీవితమే యాయనను మృతజీవిం జేయుచున్నది.

రామతీర్థుఁ డనేకోపన్యాసముల నిండియాలోను, అమెరికాలోను నిచ్చెనుగాని యవన్నియు లభింపలేదు. అమెరికాదేశమున నిచ్చిన కొన్ని యుపన్యాసములు మాత్ర మచ్చొత్తింపఁ బడినవి. వానిలో నిండియాదేశముపై నుపన్యసించిన విషయము రామతీర్థుని యద్వితీయదేశాభిమానమును నసదృశమాతృదేశభక్తిని, ననవరత సౌభ్రాత్రమును, మాతృదేశాభివృద్ధికై యత్యంతాభిలాషను వెల్లడించుచున్నది. జాతీయధర్మ విషయమై రామతీర్థుఁ డొసంగిన యుపన్యాసమును సంక్షేపముగ నిందుఁ బొందుపఱచుచున్నాను.

ఇండియాదేశమున శైవులు, వైష్ణవులు, బౌద్ధులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, పారసీకులు, ఇంక ననేక మతస్థులు గలరు. వీరిలో నొకరికొకరికి వైషమ్యములు మెండు. అనేకపురుషాంతరములనుండి వీరిజన్మభూమి యొక్కటే యైనను, ఇరుగుపొరుగువారలైన, మత మేదైనను, కలసి మెలసి యుండఁజాలరు. దీనికిఁ గారణ మేమనఁగా వీరలలో నైకమత్యము ప్రేమ శూన్యముగా నున్నది ఒక్కొక్క మతమునం దనేకావాంతరమతభేదములు కలవు. ఇవ్విధముగ నానా మతసాంప్రదాయక శాఖోపశాఖలు బలములగుటచే నిండియాదేశస్థులకు సామాన్యజాతీయబుద్ధి యడు

గించెను. ప్రపంచనిర్వాహణమును దిట్టి భిన్నమతస్వరూపము వలన నెంతమాత్ర ముపయోగ ముండ లేదని రాముని యభిప్రాయము కాదు. వాస్తవముగాఁ బ్రయోజన మున్నది. బీజాంకురముయొక్క ప్రాణమునకు నభివృద్ధికిని గొంతకాలమువఱకు బీజకోశ మేవిధముగ నావశ్యకమో, కొంతవృద్ధిం జెందినపిమ్మట నాకోశమును వదలివేయకుండిన నది యెట్లు చెఱసాలవలెఁ బరిణమించి కోశమునకన్న ముఖ్యమగు బీజాంకురమునకు హాని కలుగఁజేయునో య దేవిధముగ ని మతభేదములును, బ్రతిమనుజుఁడును గొంత యభివృద్ధిం జెందిన పిమ్మట బీజాంకురము భంగిఁ బై కోశమును వదలవలసి యుండును.

నిరుత్సాహమైన ప్రశంస గాని మతసహనము గాని వృథా యగును. జాతీయోత్సాహమును విస్తరింపఁజేయుటకు ఇండియాదేశమునందలి ప్రతిబాలునియొక్క ప్రోత్సాహ సాహాయ్య మావశ్యకము. ప్రతిబాలుఁడును బాల్యావస్థం జెందక జవ్వనము చెందనేరఁడు. స్వజాతితో నైక్యముఁ బొందనేరని మనుజుఁడు భగవంతునితో నైక్యముఁ బొందనేరఁడు. ఇండియాదేశ మంతయుఁ దనయందు మూర్తీభవించి యున్నదని తలంచి, భారతమాతయొక్క ప్రతిపుత్రుఁడును మాతృదేశమునకు సేవఁ జేయ సిద్ధముగా నుండవలయును. ఇండియాదేశమందుఁ బట్టణములు, ప్రవా

హములు, వృక్షములు, శిలలు, పశువులు చేతనత్వ
మారోపింపఁబడి పావనముగాఁ జేయఁబడియున్నవి. మాతృ
భూమి నంతటి నొక దేవినిగా భావించి భక్తితోఁ బూ
జింప సమయ మింకను రాలేదా? దుర్గ మొదలగు విగ్రహ
ములకుఁ బ్రాణప్రతిష్ఠఁ జేసి దైవత్వమును గల్పించి హిందు
వులు సేవచేయుచుండుటలేదా? అంతకన్న నిజమగు భారత
మాత యను దుర్గయం దంతర్గతమైన మహిమను బ్రకటీక
రించి సత్వమును దేజస్సును ఉత్పాదించుట యుచితమైన
కార్యము గాదా? మనహృదయముల నన్నింటి నొకటిగఁ
జేర్చిన, మనతలలు హస్తములు స్వాభావికముగఁ గలిసికొ
నును "మన మెట్లు తలంచిన నావిధముగా మన మగు
దుము" అని శ్రీకృష్ణభగవానులు నుడివియుండలేదా?
ప్రియమైనయిండియాదేశపు శాస్త్రీయపక్షావలంబకులారా!
శాస్త్రములను జక్కఁగా నాచరణలోనికిఁ దీసికొనిరండు.
జాతీయాంతఃకరణమునకుఁ దీక్ష్ణమైన వర్గభేదముల నధీనము
గాఁ జేసి, కఠోరమైన వర్ణాశ్రమధర్మములను సుళువు చేయు
మని మన దేశముయొక్క యాపద్ధర్మ మర్థించుచున్నది. దేశ
భ్రష్టులకు సాహసికులకు శరణ మిచ్చి, యెన్నియో వంశము
లకు దేశములకు రక్షణ మొసంగిన హిందూదేశము, ప్రస్తు
తము తనదేశపు బాలికాబాలురకే యన్న మొసంగలేక
యున్నదని మీరు గుర్తెఱుంగరా? వారి వారి ప్రజ్ఞకుం

దగినస్థితిఁ జెందుటకు నందఱకు సమానమైన స్వేచ్ఛ నిండు. తల యెంతయెత్తున నైనను మీ యిష్టప్రకార ముంచుకొన వచ్చునుగాని కాళ్లుమాత్రము సమానభూమియం దుంపఁ బ్రయత్నింపవలయును. ఎన్నఁటికిని, ఎంత బలహీనముగా నుండినను నిష్టముగా నుండినను, ఒకరి భుజములందుఁ గాని, మోపెయందుఁ గాని, ఇంకొకఁడు తనకాళ్ల నుంపఁగూడదు.

ఘానవపు సంఘసంస్కర్తలారా! హిందూదేశ మందలి ప్రాచీనాచారములను, బరలోకసాధన మైన కార్యములను నిందింపకుఁడు. అసంగతమై గిట్టనటువంటి నూతనవిషయములను బ్రవేశపెట్టుటచే ఇండియాదేశపు జను లేకత్వమును జెందఁజాలరు. ఇండియాదేశపు టధఃప తనమునకుఁ బరమార్థనిష్ఠను మతమును నిందింపఁ గూడదు. ముండ్లకంచెలు ముండ్లచెట్లు యావరణములు లేక, యుద్యానము దొంగలపా లయ్యెను. లేని ముండ్లకంచెలను దిరుగఁ గల్పింపుఁడు గాని, సంస్కారము, అభివృద్ధి యనుపే రిట నుద్యానమధ్యమందున్న పన్నీరుచెట్లను, ఫలవృక్షములను బెళ్లగించునంత దుడుకుగా నుండకుఁడు. పావనము లైన ముండ్లు కంచెలు మనదేశమునందుఁ గావలసియున్నవి.

దేశచరిత్రమం దత్యుత్కృష్టమైన కాలమందు మనము పుట్టినందునకు మనము భారతమాతకు వందనము లాచరింప వలయును. ఏల యనఁగా మాతృదేశసేవ ప్రాచుర్యముగా

నొనరించుట కివకాశము లనేకము లుండును. ఇండియాదే శపు జనులకు బోధింపవలసిన విషయములు, ఛిద్రాన్వేష ణము గాక గుణగ్రహణభావము, స్వాభిప్రాయసంకల్పము, సం యోగసహజజ్ఞానము, వ్యవహారతుల్యమూలత్వము పరిశ్రమ కులీనత్వము అయియున్నవి. ఒక తెగవారింకొక తెగవారి దోష ములను గనుపెట్టి దూషించుటయందు వారిశక్తి నంతయు వృథాపఱచుచున్నారు. ఇరు తెగలందును సంయోగమునకుఁ దగునంశములం గనుఁగొని వానిని దృఢీకరింపవలయును. ఆర్య సమాజమువారిక లభ్యులగు కొందఱు సనాతనధర్మమువారికి గమ్యులు గారు. కొందఱికి బ్రహ్మసమాజము మాత్రమే యిష్టము, మఱికొందఱికి వైష్ణవము. ఈవిధముగా ననేకులు గలరు. నామతి మిచ్చునట్లువంటి సంతోషమునకు, బలము నకు లక్ష్యపెట్టనివారలందుఁ దప్పులను గనుపెట్టుటకు నా కేమి స్వతంత్రత కలదు? వారలు రాని, నిలువని, పోనిమ్ము, విషయములను వారియిష్టానుసారము పోనిచ్చెదను. నీవుగాని, నేనుగాని యందఱును మనపక్షమే యవలంబించుట కేల ప్ర యత్నింపవలయును? ప్రేమించువారిని, ద్వేషించువారిని, అందఱిని సేవించుటయే నాకు స్వతంత్రత. కేవలదుర్బలు లుగా నుండిన పిల్లల నెక్కువగాఁ దల్లి ప్రేమించును. మనతో భిన్నాభిప్రాయులుగా నుండిన వారందఱును సదోషులా? అట్లైనవారును దేశమునకుఁ గావలసినవారలే. భగవం

తుని నేత్రములనుండి విషయములను జూచు తెలుఁగుటే నిజమైన విద్యాగ్రహణము.

దేశము యొక్క శ్రేయస్సు నభివృద్ధి చేయుటకై యేమి యొనర్చినను నది దేవతలకు సేవచేయుట యగును. భారతమాత కీ విధమైన సేవ సమర్పింపవలయును. ఈ విధమైన యజ్ఞమునకే గీతలో

శ్లో॥ యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః।
తేత్వఘం భుఞ్జతే పాపా యేపచన్త్యాత్మకారణాత్॥

అని చెప్పఁబడి యున్నది. మనబుద్ధి, సంకల్పము, జీవితము, ధనము, అంతయుఁ బ్రతిక్షణమును మన దేశమునకు వినియోగపఱచుటకు సిద్ధముగా నుండవలయును. రెండు, రెండు. జాతీయధర్మమునకై కులాచారములను యజ్ఞము చేయవలయును.

ఇండియా దేశమునను, సాంఘిక దోషము లనేకములు గలవు. స్వకాయకష్టోల్లంఘనము అస్వాభావిక వర్ణవిభాగములు, అంతశ్శాఖాభేదములు, అన్యదేశయాత్రావిముఖత్వము, శిశువివాహము, స్త్రీల యొక్క అస్వాతంత్ర్యము అజ్ఞానము మొదలగుదోషములు సంఘసంస్కరణత్వమునకుఁ గారణము లయ్యెను. వీనిని సంస్కరించుటయందు దూషణ, నిందలు, దుర్భావములు, వైమనస్యములు, విచ్ఛేదము లనేకములు సంభవించును. వీనికి వెఱచి సంఘము పాడగుచుండు

టం జూచుచు నెవరికి వారు కడతేరుమార్గమును వెదకి కొనుట న్యాయమా? అయ్యది సాధ్యమా? మునుఁగుచున్న సంఘము వీరలను విడిచిపెట్టునా! సంఘము పడిన వీరును బడుదురు, లేచిన వీరును లేచెదరు. అసమగ్రమైన సంఘము నుండి సమగ్రత్వము కాంచు టెట్లు? ఇది యసంగతము.

ఇండియా దేశ మతిత పేదఱికము గలిగి జనభూయిష్ఠమైన దేశము ప్రపంచమున మఱిద్దియుఁ గానరాదు. సామాన్య మైన ఇండియా గృహస్థితి జాతీయసర్వస్వస్థితిం దెల్పుచుం డును. రాబడి కింతఁ దక్కువ. ప్రతి సంవత్సరము గృహ మందలి జనసంఖ్య యధికమగుచుండును. వివాహము మొద లగు కార్యములకు వెచ్చములు హెచ్చుగా నుండును. తిను టకు నిండుతిండి లేక యొకరింకొకరికిఁ బోరాడుచుం దురు. ఇందులకుఁ గారణము వలయుధనము లేకుండుటయే. ఈ కష్టమును నివారించు సదుపాయ మూహింప వలయును. (1) హిందూదేశమును దాఁటి వెళ్లుటచే స్వర్గము రాదను భావమును విడువవలయును. ఇక్కడఁ గూటికిలేక మలమల మాడుచున్న వార లందఱును నితరదేశములకు వెళ్లవలయును. బావిలోని కప్పవలె నిక్కడనే యుండిన నేమిప్రయోజనము? (2) మఱియొకమార్గము వివాహసంబంధములను సంస్క రించుట, ముఖ్యమై పవిత్రమైన విధానము, నిర్లక్ష్యముగా నశాస్త్రీయముగా నవమానకరముగా నుపయోగింపఁబడు

చున్నది. జాతకము లున్నను జ్యోతిశ్శాస్త్రగణితము లున్నను, మంచిముహూర్తములు కుదిరినను, మంత్రము లుచ్చరింపఁబడినను, ఎన్నియజ్ఞకర్మలు సలుపఁబడినను, ఇండియాదేశములోని వివాహములు, అలౌకికములు, అశుభకరములు, అపవిత్రములు నై యున్నవి. తమపొట్టలు తాము నింపుకొనుటకు శక్తి చాలనివారికి వివాహ మొనర్చుటచే, ఆవధూవరులను బవిత్రులను జేయుటకు బదులుగా, వేదమంత్రములు తమమాహాత్మ్యమును బోఁగొట్టుకొని, నిష్ఫల మగుచున్నవి. అనర్హమై శక్తిహీనమై, నిష్ప్రయోజనమై, పరాన్నభోజనులను బహూకరించుటకు దరిద్రులకు వివాహ మొనరించుట యగుచున్నది. ఇట్టి వివాహములు తత్క్షణమె నిలుపవలయును. స్త్రీప్రతిష్ఠాపనముకొఱకును, ఇండియాదేశ ప్రశస్తికిని, మీకొఱకును, మీసంతతికొఱకును, ఓ యౌవనులారా! అకాలిక, అవ్యవస్థిత, మూఢ వివాహములను నిలిపివేయవలయును. అందువలన జనులు పవిత్రు లగుదురు. ప్రపంచమందు శిశువివాహములు కుమారీవైధవ్యము మిక్కిలి యస్వాభావికములు. ఈషన్మాత్రమైన మనుష్యత్వ ముండిన వీరల యెడఁ గరుణ కలుగకుండునా? ఇట్టి యమానుష్య అస్వాభావికాచారములకు నిరోధము గల్పింపక నిద్ర యెటులు పట్టును? దుఃఖించుచున్న నిర్దోష బాలవిధవానేత్రములనుండి దైవత్వము ప్రకాశించుచు, సాహాయ్యము కోరుచుండఁ బెడ

చెవినిడి యుండ నెంతకాల మూరకయుండనగును? ఇట్టి వైపరీత్యములకు మూలమగు వివాహధర్మమును జక్కఁగా సంస్కరింపఁదగియున్నది. స్త్రీలును బురుషులును ననేకులు దరిద్రదశయం దుండువారలు వైవాహికభావమునే విడనాడి యితరపరిశ్రమలందు గాఢముగా నియుక్తులైన, వారలకు ఓజస్సు వృద్ధి యగునని శాస్త్రము ఘోషించుచున్నది. ఇంద్రియనిగ్రహము ప్రధానము. దీనికై సర్వజనులును బ్రయత్నింపవలయును. పవిత్రత పరమముఖ్యము. పవిత్రత లేకుండిన నైక్యము లేదు, శాంతి లేదు, వీర్యము లేదు, తేజస్సు లేదు, మతము లేదు. అపవిత్రునికిఁ బరమార్థమే శూన్యము. సంఘసంస్కర్తలారా! యితరులను సంస్కరించుటకుఁ బూర్వము, మిమ్ము మీరు ముందుగా సంస్కరించుకొనవలయును. తాను దాఁటి కదా యితరులను దాఁటింపవలయును. హిందూదేశమందు మీ యుద్యమములు నెఱవేఱకుండ నిష్ఫలము లగుటకుఁ గారణ మేమి? వృక్షముయొక్క వేళ్లకు నీరు పోయక, ఫలములకు నాకులకు మీరు నీరు కట్టుచున్నారు. స్త్రీలకుఁ బిల్లలకు నిమ్నజాతులకు విద్య నుపేక్షించుట మన కాధారముగా నున్న శాఖను దెగఁగొట్టుకొనుటయే. ఇంతే కాదు, జాతీయవృక్షముయొక్క మూలమును ఛేదించినట్లు పరిణమించును. ఋషులసంతతివార లగు మీరు శ్రుతినే ప్రాధాన్యముగాఁ బరిగణించి, మీ ప్రస్తుతపు స్థితిగతుల నాలోచించి, వంశపరంపరగా వచ్చుచుండిన పార

మార్థిక జీవనమును బోగొట్టుకొనకుండ, ఐరోపా, అమెరికా దేశస్థుల భౌతికాది శాస్త్రవిజ్ఞానమును, పారిశ్రామిక ప్రజ్ఞ ప్రభావమును గ్రహింపవలసి యున్నారు. వృక్షము తన ఫలములు, పుష్పములు, పల్లవములం గూర్చి ప్రశంసించు చుండి, చుట్టుప్రక్కల నుండు భూసారమును నీటిని గాలిని వెలుతురును గ్రహింపకుండిన శీఘ్రముగా నశింపదా? జాతీయ వ్యక్తిత్వమును విడనాడుమని చెప్పుటకాదు. అమెరికా, జపాన్, ఐరోపా దేశస్థులు తమ పారిశ్రామిక విజ్ఞానమును విడనాడక, మన యుపనిషద్రహస్యముల గ్రహింపదలంచి యెవ్విధముగ శాటు పడుచున్నారో, యదేవిధముగ మనమును బ్రహ్మవిద్యనుద్యోజింపక, వారి పారిశ్రామిక విజ్ఞానమును గ్రహింపవలయును.

ఈ చరిత్ర యెల్లవిధముల మార్గదర్శకముగా నున్నది. విద్యార్థులకు — వినయము పట్టుదల గురుభక్తి విద్యానురక్తి యుత్సాహము ప్రధానము లనియు, గృహస్థులకు — అతిథి అభ్యాగతులయెడ నాదరము, వృద్ధులయెడ గౌరవము, బంధువులయెడఁ బ్రీతి, అంధులు అంగవికలులయెడ సహానుభవము, సర్వులయెడ సౌజన్యము, మనోనిగ్రహము ముఖ్యము లనియు, సన్న్యాసులకు స్వార్థపరిత్యాగము, సర్వభూతహితాచరణము జితేంద్రియత్వము, అనుష్ఠేయము లనియు, రామతీర్థుని జీవితము ఉద్ఘోషించుచున్నది.

ఓం తత్సత్

# యం. ఆర్. కృష్ణరావు & కంపెని

## నెల్లూరు

---

ప్రకటిత గ్రంథములు

| | | |
|---|---|---|
| | | రాపరుబైండు ప్రతి 1-కి |
| ౧. | అమృతవల్లి (నవల) | ౧-౪-౦ |
| ౨. | రంగరాజు (నవల) | ౦-౧౪-౦ |
| ౩. | ఇందిరావసుంధరము (నవల) | ౦-౧౦-౦ |
| ౪. | జగన్మోహిని (నవల) | ౦-౧౦-౦ |
| ౫. | మంజుమతి (నవల) | ౦-౧౨-౦ |
| ౬. | జార్జి చక్రవర్తి చరిత్ర | ౦-౮-౦ |
| ౭. | రామతీర్థస్వామి ఎం. ఏ. | ౦-౮-౦ |
| ౮. | నివేదితాసోదరి | ౦-౮-౦ |
| ౯. | హార్డింజిప్రభువు | ౦-౮-౦ |
| ౧౦. | గోపాలకృష్ణ గోఖలే | ౦-౮-౦ |
| ౧౧. | మహాదేవ గోవిందరాణడే | ౦-౮-౦ |
| ౧౨. | రంగశతకము | ౦-౨-౦ |

PRINTED AT THE ANDHRA PATRIKA PRESS, MADRAS.